

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:91 | ఎడిటర్:మేనం శ్యామ్ | గురువారం 22-10-2026 | పేజీలు: 10

సిరా చుక్క

సాధించిన దానికి సంతృప్తి చెంది
చేసుకునేది కాదు "దసరా"
భరించిన బాదలపై యుద్ధానికి సిద్ధం
కావడమే "దసరా"
ఆలోచన యే "ఆయుదం"
అంకురిత దీక్ష తో
కంకణ బద్దులవడమే "పూజ"
చిన్నా పెద్దలతో కలిసి నడవడమే "యజ్ఞం"
అజ్ఞానం ఆహంకారం అభిజాత్యం
వదలడమే "పూర్ణాహుతి"
సంపదలందించే "చేతిముట్ల"
శుచి శుభ్రతే"అన్నపూర్ణ"
కరకంకణ గలగలలు ఆయుద పూజ
సాయుద పూజ
అంతరంగమున "దేవీ పూజ"
పసుపూ కుంకుమ నిమ్మకాయలు,
"జంతుబలి కాదు"అమ్మవారికిష్టం
గుమ్మడి కాయ నైవేధ్యం
ఎర్ర నీల్లతో దిష్టి తీసి
అభిషేకించడమే అవభృత స్నానం.
జమ్మి వృక్షం నేడు రమ్మని పిలుచు
అందరు కూడి మందగజేరి
ఐకమత్యం చాటుకొంటూ
"ఆకు"నే కొంగు బంగారమంటూ
ఒకరికి ఒకరు పంచుకుంటూ
ఆశీస్సులందుకుంటూ
అభిమానం పంచుకుంటూ
దశ దిశ ల మార్చే "విజయ దశిమి"
రా రమ్మని పిలుస్తోంది"
వైషమ్యాలను" విడిచిపెట్టి రమ్మంటోంది.

మీ .... రాజి రెడ్డి శీలం
ఇనుగుర్తి

పోలీసు అమరవీరుల కుటుంబాలకు భారీ భరోసా

- హోదాను బట్టి రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పరిహారం
- అర్హులైన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు
- పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తాం: సీఎం రేవంత్
- విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా 150 మందికి పైగా పోలీసుల అమరత్వం
- డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ బృందానికి జాతీయ గుర్తింపు

హైదరాబాద్, ప్రజా వాయిస్: ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలకు గౌరవంగా వారి కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొని అమరులకు నివాళులర్పించారు.

రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పరిహారం

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను పెంచినట్లు సీఎం వెల్లడించారు. గతంలో రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్న పరిహారాన్ని హోదాను బట్టి రూ.కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచగా, ఎస్పీలు, ఐపీఎస్ అధికారుల కుటుంబాలకు రూ.2 కోట్ల వరకు అందించనున్నట్లు తెలిపారు.దీనికి అదనంగా పోలీసు భద్రతా నిధి నుంచి రూ.16 లక్షలు, పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.8 లక్షలు అందించే అంశాన్ని ప్రస్తావించారు. అర్హతలు, నిబంధనలకు అనుగుణంగా అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు, నివాస స్థలాలు, పిల్లలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు, బస్ పాస్‌లు కల్పించనున్నట్లు వివరించారు. అర్హులైన వారికి వైద్య విద్యలో ప్రత్యేక రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

150 మందికి పైగా పోలీసుల త్యాగం

దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 150 మందికి పైగా పోలీసులు ప్రాణాలు కోల్పోయారని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని కొనియాడారు. వారి త్యాగాల వల్లే సమాజంలో శాంతిభద్రతలు నిలబడుతున్నాయని, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను ఎప్పటికీ మరువబోమని స్పష్టం చేశారు.అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు వారి పిల్లల భవిష్యత్తుకు అవసరమైన సహకారం అందించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.

డ్రగ్స్ నియంత్రణలో ఈగల్‌కు గుర్తింపు

మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీసు శాఖ సాధిస్తున్న పురోగతిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. జాతీయ స్థాయి సమీక్షలో ఈగల్ తెలంగాణ బృందం ఏడు ప్రమాణాల ఆధారంగా 80 శాతానికి పైగా స్కోరు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈగల్ బృందాన్ని, డీజీపీ సీవీ ఆనంద్‌ను అభినందించారు.యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు సమన్వయంతో పనిచేయాలని పోలీసు శాఖకు సూచించారు. పోలీసు సంక్షేమం, ప్రజల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తుందని సీఎం తెలిపారు.

ఎమ్మెల్సీ బరిలోకి కవిత పార్టీ

- తొలి అభ్యర్థిగా శ్రీకాంత్ గౌడ్
- వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల స్థానానికి అభ్యర్థి ఖరారు
- దసరా సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ప్రకటన
- ఎన్నికల సమన్వయకర్తగా సయ్యద్ ఇస్మాయిల్ నియామకం
- కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి శ్రీకాంత్ గౌడ్ పీహెచ్‌డీ
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఓటర్ల జాబితా తయారీ

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా నలమాస శ్రీకాంత్ గౌడ్ పేరును అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖరారు చేశారు. దసరా సందర్భంగా పార్టీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. పార్టీ ఏర్పాటైన తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి అభ్యర్థిని ప్రకటించడం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉద్యమ నేపథ్యం.. పార్టీ గొంతుకగా గుర్తింపు

ఉమ్మడి వరంగల్ జిల్లా, ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లికి చెందిన శ్రీకాంత్ గౌడ్ కాకతీయ

మిగతా 2లో

స్నాక్స్ తయారీలో అపరిశుభ్రత

- సాహిల్ ఫుడ్స్‌పై టీజీ సేఫ్ కొరడా
- ప్రేమావతిపేటలో ఐదు తయారీ యూనిట్లపై అధికారుల దాడులు
- నాలుగు యూనిట్ల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు సస్పెండ్
- కల్తీ అనుమానంతో 11 నమూనాల సేకరణ
- నిబంధనలకు విరుద్ధమైన లేబులింగ్‌తో 55 టన్నుల ఆహార పదార్థాలు సీజ్
- సీజ్ చేసిన సరుకుల విలువ రూ.33.94 లక్షలు

2లో

పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల పసిడి పంట

- 100 మీటర్ల టీ12 విభాగంలో సిమ్రాన్‌కు స్వర్ణం
- వరుసగా రెండో స్వర్ణంతో సిమ్రాన్ అరుదైన ఘనత
- పురుషుల టీ47 విభాగంలో దిలీప్‌కు పసిడి పతకం
- 400 మీటర్ల పరుగులో అకీరా నందన్ బానోతుకు రజతం
- మొత్తం 54 పతకాలతో భారత్ నాలుగో స్థానం

ప్రజా వాయిస్ క్రీడా విభాగం: జపాన్ వేదికగా జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. అద్భుత ప్రదర్శనతో స్వర్ణ, రజత పతకాలను ఖాతాలో వేసుకుంటున్నారు. తాజాగా మహిళల టీ12 విభాగంలో 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత పారా అథ్లెట్ సిమ్రాన్ స్వర్ణ పతకం సాధించింది. అంతకుముందు 200 మీటర్ల పరుగులోనూ పసిడి గెలిచిన ఆమె, వరుసగా రెండు స్వర్ణాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది.

సిమ్రాన్ డబుల్ ధమాకా

మంగళవారం జరిగిన 200 మీటర్ల ఈవెంట్‌లో విజేతగా నిలిచిన సిమ్రాన్.. తాజాగా 100 మీటర్ల స్ప్రింట్‌లోనూ ప్రత్యర్థులను

మిగతా 2లో

ఫార్మా ల్యాబ్‌ల ముసుగులో డ్రగ్స్ దందా!

- హైదరాబాద్ శివార్లలో అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు
- కొండమడుగు, మౌలాలిలో అక్రమ తయారీ కేంద్రాల గుర్తింపు
- గుజరాత్ నుంచి తప్పుడు లేబుల్స్‌తో రసాయనాల తరలింపు
- వాసాయికి చెందిన రసాయనాల సరఫరాదారు అరెస్ట్
- అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్ దర్యాప్తు

2లో

బతికున్న రోగిని చనిపోయినట్లు నిర్ధారించారా?

- కాకతీయ ఆసుపత్రి నివేదికలపై తీవ్ర అనుమానాలు
- వైద్యాధికారులు స్పందించాలి
- మేడిపల్లి కాకతీయ ఆసుపత్రిలో మల్లమ్మకు చికిత్స
- రోగి పరిస్థితిపై భయాందోళనకు గురిచేశారని ఫిర్యాదు
- మరో ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు కుటుంబం వెల్లడి
- నివేదికల్లో మరణించినట్లు నమోదు చేశారంటూ ఆవేదన
- వైద్యాధికారులు, ఆరోగ్యశాఖ మంత్రి విచారణ జరపాలని విజ్ఞప్తి

మేడిపల్లి, ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం: ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు, రోగుల పట్ల వ్యవహరించే తీరుపై మరోసారి తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన రోగి పరిస్థితి విషమంగా ఉందంటూ కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేయడం ఒకవైపు.. అనంతరం ఇచ్చిన వైద్య నివేదికల్లో రోగి మరణించినట్లు నమోదు చేశారనే ఆరోపణలు మరోవైపు కలకలం రేపుతున్నాయి. మేడిపల్లిలోని కాకతీయ ఆసుపత్రికి సంబంధించి మల్లమ్మ కుటుంబం వెల్లడించిన వివరాలు వైద్యాధికారుల దృష్టికి వెళ్లాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

అసలేం జరిగింది?

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 64 ఏళ్ల మల్లమ్మ తీవ్ర రక్తపోటు, తక్కువ పల్స్ రేటుతో 2026 ఆగస్టు 27న రాత్రి 9 గంటల సమయంలో మేడిపల్లిలోని కాకతీయ ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆసుపత్రిలో చేరిన 24 గంటల్లోనే సుమారు రూ.45 వేల బిల్లు వేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రోగి పరిస్థితి సాధారణంగానే కనిపిస్తున్నప్పటికీ, ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పి భయాందోళనకు

మిగతా 2లో

తెలంగాణకు మరో రూ.2,000 కోట్ల అప్పు

- ఆర్‌బీఐ ఈ-వేలం ద్వారా రుణ సేకరణ
- 7.53 శాతం వడ్డీతో రూ.1,000 కోట్లు
- 7.65 శాతం వడ్డీతో మరో రూ.1,000 కోట్లు
- 13, 23 ఏళ్ల కాలపరిమితి తులతో రుణాలు
- 11 రాష్ట్రాలు కలిపి రూ.23,016 కోట్ల అప్పులు

2లో

ఎమ్మెల్సీ బరిలోకి కవిత పార్టీ

మొదటి పేజీ తరువాయి

విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన, తెలంగాణ జాగృతి ప్రారంభ దశ నుంచే కవితతో కలిసి పనిచేసినట్లు పార్టీ పేర్కొంది. పార్టీ అధికార ప్రతినిధిగా టీవీ చర్చలు, ప్రజా సంఘాల సమావేశాల్లో తన వాణిని వినిపించారని తెలిపింది.

బహుజనుల గొంతుకగా నిలిచే ప్రయత్నం

తెలంగాణ రక్షణ సేన తరపున తొలి ఎన్నికల అభ్యర్థిగా శ్రీకాంత్ గౌడ్‌ను ప్రకటించడం ద్వారా బహుజనుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలనే తమ వైఖరిని కొనసాగిస్తున్నామని పార్టీ వెల్లడించింది. ఈ ఎన్నికల నిర్వహణలో సమన్వయం కోసం సయ్యద్ ఇస్మాయిల్‌ను కోఆర్డినేటర్, అబ్జర్వర్‌గా నియమించినట్లు ప్రకటించింది. అభ్యర్థి ఎంపికతో పార్టీ రాజకీయ కార్యాచరణకు కొత్త దశ ప్రారంభమైనట్లయింది.

రెండు పట్టభద్రుల స్థానాలపై ఎన్నికల సంఘం కసరత్తు

మరోవైపు, తెలంగాణ శాసనమండలిలోని మ హ బూబ్‌న గ ర్– ర ంగారెడ్డి– హైద రాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాలకు కొత్త ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ రెండు స్థానాల ప్రస్తుత సభ్యుల పదవీ కాలం 2027 మార్చితో ముగియనుండటంతో, ఆలోగా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది.2026 నవంబర్ 1ను అర్హత తేదీగా తీసుకొని పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టారు. సెప్టెంబర్ 28న బహిరంగ నోటీసు జారీ చేయగా, నవంబర్ 6 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. నవంబర్ 20 నాటికి ముసాయిదా జాబితాల తయారీ, ముద్రణ పూర్తి చేసి, నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయాలని నిర్ణయించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

ఓటర్ల నమోదుపై పట్టభద్రులు దృష్టి సారించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంది. ఓటర్ల జాబితా సిద్ధమైన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన తొలి అభ్యర్థిగా శ్రీకాంత్ గౌడ్‌ను ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

బతికున్న రోగిని చనిపోయినట్లు నిర్ధారించారా?

KAKATIYA HOSPITALS
New Horizons in Healthcare

Date:30.08.2026

EMERGENCY CERTIFICATE

This is to certify that Mrs.SANKABUDDI MALLAMMA W/o S.Narsimha , Age 64/F, Was admitted our Hospital on 27.08.2026 emergency.

She was diagnosed to be suffering from AE OF COPD, OSA with TYPE II RF, LRTI, AKI on CKD, LEFT KNEE OA. She Underwent Medical Management done. On 27.08.2026 and death on 28.08.2026.

Dr. D[illegible]YA KUMAR
MBBS,MD. Anaesthesiology
Reg No. 25214
Medical Superintendent
KAKATIYA HOSPITALS
Medipally, PMC.

For KAKATIYA HOSPITALS
AUTHORIZED SIGNATORY

Road No. 2, P & T Colony,
No. 99, Medipally, PMC, Hyd - 039.
+91-9652244111 | 040-272005

మొదటి పేజీ తరువాయి

గురిచేశారని పేర్కొన్నారు.

కుటుంబ సభ్యుల్లో ఆందోళన.. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్

రోగి పరిస్థితిపై చేసిన వ్యాఖ్యలతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని సమాచారం. ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 28న మల్లమ్మను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయించి ఇంటికి తీసుకెళ్లినట్లు కుటుంబం తెలిపింది. సుమారు మూడు గంటల తర్వాత ఆమెను మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు పేర్కొంది. అయితే, ఈ వివరాలకు సంబంధించిన వైద్య రికార్డులు, చికిత్స పత్రాలను స్వతంత్రంగా పరిశీలించాల్సి ఉంది.

మరణించినట్లు నివేదికలో నమోదు చేశారా?

ఈ వ్యవహారంలో అత్యంత తీవ్రమైన ప్రశ్న మల్లమ్మ మరణానికి సంబంధించిన వైద్య నివేదికలపై ఉంది. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసేందుకు కుటుంబ సభ్యులు 2026 అక్టోబర్ 20న కాకతీయ ఆసుపత్రికి వెళ్లి బిల్లులు, సంబంధిత పత్రాలు అడిగినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చిందని వారు చెబుతున్నారు. ఆసుపత్రి యాజమాన్యం ఇచ్చిన నివేదికల్లో మల్లమ్మ 2026 ఆగస్టు 28నే మరణించినట్లు నమోదు చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.రోగిని ఆసుపత్రి నుంచి తీసుకెళ్లిన తర్వాత మరో ఆసుపత్రిలో చికిత్స అందించామని కుటుంబం చెబుతున్న నేపథ్యంలో.. అసలు మరణం ఎప్పుడు, ఎక్కడ సంభవించింది? మరణించినట్లు నమోదు చేసిన ఆధారాలేమిటి? ఆ సమయంలో రోగికి సంబంధించిన వైద్య పరిశీలనలు, చికిత్స వివరాలు ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.

వైద్యాధికారులు తక్షణమే విచారణ జరపాలి

ఈ ఆరోపణలపై మేడ్చల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా వైద్యాధికారి కార్యాలయం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. కాకతీయ ఆసుపత్రి రోగి నమోదు పత్రాలు, చికిత్స వివరాలు, డిశ్చార్జ్ సారాంశం, బిల్లులు, మరణానికి సంబంధించిన నివేదికలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే మరో ఆసుపత్రి వైద్య రికార్డులను కూడా సేకరించి వాస్తవాలను నిర్ధారించాలని కోరుతున్నారు.

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలి

ఒక రోగి మరణానికి సంబంధించిన నమోదు విషయంలో పొరపాటు జరిగిందా? లేక వైద్యపరమైన ఆధారాల ప్రకారమే నివేదిక రూపొందించారా? రోగి డిశ్చార్జ్ అయిన తర్వాత జరిగిన పరిణామాలను ఆసుపత్రి ఎలా నమోదు చేసింది? వంటి అంశాలపై అధికారిక వివరణ అవసరం. ఆరోగ్యశాఖ మంత్రి, సంబంధిత వైద్య నియంత్రణ అధికారులు ఈ వ్యవహారాన్ని పరిశీలించి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.రోగి మరణానికి సంబంధించిన నివేదికల్లో తప్పులు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఆసుపత్రి వాదనను, సంబంధిత వైద్య రికార్డులను పరిశీలించకుండా ముందస్తు నిర్ధారణకు రావడం కూడా సరికాదు. అందువల్ల ఈ ఘటనపై పారదర్శక విచారణ జరిపి, మల్లమ్మ కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఫార్మా ల్యాబ్‌ల ముసుగులో డ్రగ్స్ దందా!

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఫార్మా ల్యాబ్‌ల ముసుగులో హైదరాబాద్ శివార్లలో మత్తు పదార్థాల తయారీ సాగిస్తున్న అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌ను ఈగల్ ఫోర్స్ అధికారులు గుర్తించారు. కొండమడుగు, మౌలాలి పారిశ్రామిక ప్రాంతాల్లోని ల్యాబ్‌లను కేంద్రంగా చేసుకుని అక్రమ కార్యకలాపాలు నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నాగ్‌పూర్‌కు చెందిన ముఠా ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్ తయారీకి అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్న ముంబైలోని వాసాయికి చెందిన వ్యాపారిని అరెస్టు చేశారు.

ల్యాబ్‌ల ముసుగులో అక్రమ కార్యకలాపాలు

మహారాష్ట్రలో పోలీసుల నిఘా పెరగడంతో ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న చేతన్ మేశ్రామ్ తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు మార్చినట్లు అధికారులు వెల్లడించారు. అస్సాంకు చెందిన ఆయూబ్ సహాయంతో కొండమడుగులోని ఓ ల్యాబ్‌లో రసాయన రియాక్టర్‌ను అద్దెకు తీసుకుని మత్తు పదార్థాల తయారీ చేపట్టినట్లు దర్యాప్తులో గుర్తించారు. గతంలో అక్కడ పనిచేసిన వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

గుజరాత్ నుంచి రసాయనాల సరఫరా

డ్రగ్స్ తయారీకి అవసరమైన రసాయనాలను గుజరాత్‌లోని వల్సాద్ నుంచి సేకరించినట్లు అధికారులు గుర్తించారు. రవాణా సమయంలో అధికారుల నిఘా నుంచి తప్పించుకునేందుకు కొన్ని రసాయనాల డబ్బాలపై హైడ్రోక్లోరిక్ యాసిడ్ పేరుతో తప్పుడు లేబుళ్లు అంటించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ రసాయనాలను నాగ్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.2025 ఆగస్టు నుంచి 2026 జూలై మధ్య పలుమార్లు రసాయనాలను తరలించి మెఫెడ్రోన్ వంటి మత్తు పదార్థాలను తయారు చేసినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.

మౌలాలిలోనూ మరో కేంద్రం

మౌలాలిలోని మరో ల్యాబ్‌లోనూ అక్రమ తయారీ కార్యకలాపాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అక్కడ ఆల్ప్రాజోలం, ఎఫిడ్రిన్ తయారీకి సంబంధించిన వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేంద్రానికి సంబంధించి గతంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసినట్లు సమాచారం.తాజాగా అక్టోబర్ 17న రసాయనాల సరఫరాదారుని అదుపులోకి తీసుకున్న ఈగల్ ఫోర్స్ అధికారులు, ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు.

కార్మికుల నియామకంపైనా ఆరా

డ్రగ్స్ తయారీ కేంద్రాల్లో పనిచేయించేందుకు అస్సాం, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా వచ్చిన వలస కార్మికులను ఉపయోగించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ముజ్జమిల్ అనే కెమిస్ట్ ద్వారా వారికి తయారీ ప్రక్రియపై శిక్షణ ఇప్పించినట్లు అనుమానిస్తున్నారు.ఈ నెట్‌వర్క్‌లో రసాయనాల సరఫరాదారులు, ల్యాబ్‌ల నిర్వాహకులు, మధ్యవర్తుల పాత్రపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు మత్తు పదార్థాలు సరఫరా చేశారా, ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో ఈగల్ ఫోర్స్ దర్యాప్తును ముమ్మరం చేసింది.

స్నాక్స్ తయారీలో అపరిశుభ్రత

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ అధికారులు కొరడా ఝళిపించారు. కాటేదాన్ సమీపంలోని ప్రేమావతిపేటలో సాహిల్ ఫుడ్స్‌కు చెందిన ఐదు తయారీ యూనిట్లపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో అపరిశుభ్రత, యంత్రాల నిర్వహణలో నిర్లక్ష్యం, ఆహార పదార్థాల నిల్వలో ఉల్లంఘనలు గుర్తించడంతో నాలుగు యూనిట్ల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేశారు.

55 టన్నుల ఆహార పదార్థాలు సీజ్

తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా లేబులింగ్ చేసిన 55 టన్నుల ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.33.94 లక్షలుగా అంచనా వేశారు. ఆహార పదార్థాల్లో కల్తీ జరిగిందనే అనుమానంతో 11 నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. వాటి ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో తయారీ

స్నాక్స్ తయారీ కేంద్రాల్లో ఆహార వ్యర్థాలు పేరుకుపోవడం, యంత్రాల నిర్వహణ సరిగా లేకపోవడం, తగిన గాలి ప్రసరణ సదుపాయాలు లేకపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాలను నేలపైనే నిల్వ చేసినట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఉత్పత్తుల తయారీ, నిల్వ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలను విస్మరించినట్లు అధికారులు గుర్తించారు.

తయారీ సమయంలోనూ నిర్లక్ష్యం

ఆహార పదార్థాలను తయారు చేస్తున్న సమయంలో కొందరు సిబ్బంది గుట్కా, పాన్ మసాలా నములుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆహార తయారీ కేంద్రాల్లో వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత కూడా తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరీక్షల ఫలితాల తర్వాత తదుపరి చర్యలు

నాలుగు యూనిట్ల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేయడంతోపాటు, వాటి కార్యకలాపాలను నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు సురక్షితమైన ఆహారం అందేలా తనిఖీలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల పసిడి పంట

మొదటి పేజీ తరువాయి

అధిగమించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఒకే క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించడం భారత బృందానికి మరింత ఉత్సాహాన్నిచ్చింది.

దిలీప్‌కు స్వర్ణం.. బానోతుకు రజతం

★పురుషుల టీ47 విభాగంలో 100 మీటర్ల స్ప్రింట్ పోటీలో భారత అథ్లెట్ దిలీప్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. మరోవైపు పురుషుల 400 మీటర్ల టీ35/38 విభాగంలో అకీరా నందన్ బానోతు రజత పతకాన్ని సాధించాడు. 51.25 సెకన్లలో రేసును పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు.

పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానం

తాజా వివరాల ప్రకారం భారత్ ఖాతాలో ఇప్పటివరకు 14 స్వర్ణాలు, 20 రజతాలు, 20 కాంస్యాలు కలిపి మొత్తం 54 పతకాలు చేరాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. భారత పారా అథ్లెట్ల ప్రదర్శనతో దేశ క్రీడాభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

దసరా వేళ మద్యం అమ్మకాలు జోరు

- **19 రోజుల్లో రూ.2,054 కోట్ల విక్రయాలు**
- **గతేడాదితో పోలిస్తే 37.02 శాతం పెరిగిన అమ్మకాలు**
- **19 రోజుల్లో 30.37 లక్షల కేసుల బీర్ల విక్రయం**
- **గతేడాది కంటే అదనంగా 8.82 లక్షల కేసుల బీర్లు అమ్మకం**
- **బీర్ల విక్రయాల్లో 40.93 శాతం వృద్ధి**
- **అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల మద్యం విక్రయాలు**

మార్కు దాటిన అమ్మకాలు

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణలో దసరా పండుగ సీజన్ మద్యం వ్యాపారానికి భారీ ఊతమిచ్చింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం విక్రయాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాల విలువ 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బీర్ల విక్రయాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది.

19 రోజుల్లోనే రూ.2 వేల కోట్లు

ఎక్సైజ్ శాఖ వివరాల ప్రకారం.. 2026 అక్టోబర్ 1 నుంచి 19వ తేదీ వరకు మద్యం విక్రయాల విలువ రూ.2,054.51 కోట్లకు చేరింది. అక్టోబర్ 16 నాటికి రూ.1,527.85 కోట్లుగా ఉన్న అమ్మకాలు, మూడు రోజుల్లోనే భారీగా పెరిగాయి. అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. పండుగ సమయంలో పెరిగిన కొనుగోళ్లు ఈ గణాంకాల్లో ప్రతిబింబిస్తున్నాయి.

బీర్ల విక్రయాల్లో 40 శాతానికి పైగా వృద్ధి

ఈసారి బీర్ల అమ్మకాలు ప్రత్యేకంగా నిలిచాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా 30.37 లక్షల కేసుల బీర్లు విక్రయమయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో 21.55 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. దీంతో ఈసారి అదనంగా 8.82 లక్షల కేసుల విక్రయాలు నమోదయ్యాయి. బీర్ల అమ్మకాల్లో 40.93 శాతం వృద్ధి కనిపించింది.

తెలంగాణకు మరో రూ.2,000 కోట్ల అప్పు

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్ల రుణాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సోమవారం నిర్వహించిన ఈ–వేలం ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించింది. రాష్ట్ర అవసరాల కోసం రెండు వేర్వేరు కాలపరిమితులతో రుణాలు తీసుకుంది.

రెండు విడతల్లో రుణ సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం 7.53 శాతం వార్షిక వడ్డీతో 13 ఏళ్ల కాలపరిమితి కలిగిన రూ.1,000 కోట్ల రుణాన్ని తీసుకుంది. మరో రూ.1,000 కోట్లను 7.65 శాతం వార్షిక వడ్డీతో 23 ఏళ్ల కాలపరిమితికి సేకరించింది. ఈ రెండు రుణాల ద్వారా ప్రభుత్వం మొత్తం రూ.2,000 కోట్ల నిధులను సమకూర్చుకుంది.

11 రాష్ట్రాలు.. రూ.23,016 కోట్ల అప్పులు

ఆర్‌బీఐ నిర్వహించిన ఈ–వేలంలో దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు పాల్గొని మొత్తం రూ.23,016 కోట్ల రుణాలను సేకరించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆర్థిక అవసరాల కోసం మార్కెట్ నుంచి రుణాలు సమీకరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ తాజా రుణ సేకరణ ప్రాధాన్యం సంతరించుకుంది.



ఎండుతున్న పంటలకు సాగునీరు ఏదీ.?

- ఎల్34, ఎల్35, ఎల్36 లిఫ్ట్ ల ద్వారా వెంటనే నీరు విడుదల చేయాలి
- నడిగూడెం ఇరిగేషన్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ధర్నా

ప్రజా వాయిస్, నడిగూడెం: నడిగూడెం మండల ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. రైతులతో కలిసి నడిగూడెంలోని నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు.ఎల్34, ఎల్35, ఎల్36 లిఫ్ట్‌ల ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని, చెరువులు నింపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, నడిగూడెం రైతుల అవసరాలను పక్కనపెట్టి పాలేరు ప్రాంతానికి నీటిని తరలిస్తున్నారని మల్లయ్య యాదవ్ ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుండారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లపై రాజకీయ రగడ.!

- గత పదేళ్ల నిధుల లెక్కలు చెప్పాలి
- గ్రామాభివృద్ధిపై చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జాప రాజిరెడ్డి

ప్రజా వాయిస్, కోహెడ: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల అంశం రాజకీయ వివాదానికి దారితీస్తోంది. గ్రామసభ పేరుతో పేదల ఇళ్ల అంశాన్ని రాజకీయంగా మార్చడం సరికాదని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాప రాజిరెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని, గత పదేళ్లలో గ్రామానికి వచ్చిన నిధులు, చేపట్టిన పనుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, వైద్య సహాయం కోసం ఎల్ఓసీలు, మహిళా సంక్షేమ పథకాలు, రహదారుల అభివృద్ధి ద్వారా ప్రయోజనం కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గుండారెడ్డిపల్లికి ఎంత అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హయాంలో మంజూరైన ప్రత్యేక అభివృద్ధి నిధులు, 14వ, 15వ ఆర్థిక సంఘాల ద్వారా వచ్చిన నిధులు, గ్రామపంచాయతీకి సమకూరిన ఇతర నిధుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆయా నిధులతో చేపట్టిన పనులు, చేసిన ఖర్చులపై స్పష్టత ఇవ్వాలని కోరారు.ప్రభుత్వ పథకాలపై రాజకీయాలు చేయడం కంటే గ్రామానికి వచ్చిన నిధులు, పూర్తయిన పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవాలతో చర్చించడం ముఖ్యమని రాజిరెడ్డి పేర్కొన్నారు. గ్రామసభలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలు కావాలని, రాజకీయ విమర్శలకు పరిమితం కాకూడదన్నారు. అన్ని పార్టీల నాయకులు గ్రామాభివృద్ధికి సహకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన పేదలకు న్యాయం జరగాలని కోరారు.

విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- మందమర్రిలో ఘనంగా పోలీసు సంస్మరణ దినోత్సవం
- అమరవీరుల స్థూపం వద్ద నివాళుల ర్పించిన సీఐ రమేష్

ప్రజా వాయిస్, మందమర్రి: దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మందమర్రి సీఐ రమేష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీసు వలయం ఆధ్వర్యంలో సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర వ్యహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించి అమరవీరులను స్మరించుకున్నారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్నారని సీఐ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలు ప్రతి పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ నరేష్, కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, దేవాపూర్ ఎస్ఐ గంగారాం, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్‌తో పాటు మందమర్రి పోలీసు వలయ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు వైద్య సేవలపై మార్గదర్శకత్వమే చిరుసేవ లక్ష్యం

- 15 ఏళ్లకు పైగా ఆరోగ్య రంగంలో అనుభవం
- 30 వేల మందికి వైద్య సేవల్లో సహకారం
- వెయ్యికి పైగా వైద్య శిబిరాల్లో భాగస్వామ్యం
- చిన్నారుల గుండె శస్త్రచికిత్సలకు చేయూత
- చిరంజీవి 9642908108

ప్రజా వాయిస్,హైదరాబాద్: ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు సరైన వైద్యుడిని సంప్రదించడం, తగిన ఆసుపత్రిని ఎంపిక చేసుకోవడం, చికిత్స ఖర్చులు తెలుసుకోవడం, బీమా సదుపాయాలు పొందడం సామాన్య ప్రజలకు సవాలుగా మారుతున్న నేపథ్యంలో వారికి మార్గదర్శకత్వం అందించడమే లక్ష్యంగా చిరుసేవ రోగి సేవల సంస్థ పనిచేస్తోంది. 'మీ ఆరోగ్యం మా బాధ్యత.. మీ సేవే మా లక్ష్యం' అనే నినాదంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రజలకు వైద్య సేవలపై సమాచారం, మార్గదర్శకత్వం, సమన్వయ సహాయం అందిస్తోంది.

వైద్య సేవలకు ఒకే వేదికగా..

ఆరోగ్య సమస్యను బట్టి సంబంధిత వైద్య నిపుణుడిని గుర్తించడం, అవసరమైన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రిని ఎంపిక చేసుకోవడం, చికిత్స ఖర్చుల వివరాలు తెలుసుకోవడం వంటి అంశాల్లో ఈ సంస్థ సహకరిస్తోంది. ఐదు వేల మందికి పైగా వైద్యులు, ఐదు వందలకు పైగా ఆసుపత్రులకు సంబంధించిన నెట్‌వర్క్ సమాచారం ఆధారంగా రోగులకు అవసరమైన వైద్య సేవలను గుర్తించేందుకు తోడ్పడుతోంది.

బీమా, ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రైవేటు ఆరోగ్య బీమా, నగదు రహిత చికిత్స, ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకాల అర్హత, చికిత్స పరిధి, అవసరమైన పత్రాలపై సంబంధిత సంస్థల ద్వారా వివరాలు తెలుసుకోవడంలో మార్గదర్శకత్వం అందిస్తోంది. అలాగే శస్త్రచికిత్సలు, ఇతర ముఖ్యమైన చికిత్సల విషయంలో రెండో వైద్య అభిప్రాయం పొందేందుకు సహకరిస్తోంది. అంబులెన్సులు, వైద్య పరీక్షలు, మందులు, ఇంటివద్ద వైద్య సంరక్షణ, ఆసుపత్రిలో చేరిక నుంచి డిశ్చార్జి వరకు అవసరమైన సమన్వయ సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

చిరంజీవి కె. ఆధ్వర్యంలో సేవలు

చిరుసేవ పేషెంట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు చిరంజీవి కె.కు ఆరోగ్య రంగంలో 15 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఇప్పటివరకు వెయ్యికి పైగా వైద్య శిబిరాల నిర్వహణలో భాగస్వామ్యం వహించడంతో పాటు, 30 వేల మందికి పైగా రోగులకు వైద్య సేవలు పొందే ప్రక్రియలో మార్గదర్శకత్వం, సమన్వయ సహాయం అందించినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, ముంబై, తమిళనాడు ప్రాంతాల ప్రజలకు కూడా వైద్య సహాయం అందించడంలో తోడ్పడ్డారు.

చిన్నారుల గుండె చికిత్సలకు చేయూత

తన సమన్వయ ప్రయత్నాల ద్వారా వంద మందికి పైగా చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు అందేలా, యాభై మందికి పైగా కృత్రిమ శ్వాస సహాయంపై ఉన్న రోగులకు తగిన ఆసుపత్రుల్లో చికిత్స లభించేలా సహకరించినట్లు చిరంజీవి కె. తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సరైన వైద్య సమాచారం అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.రోగుల వ్యక్తిగత సమాచార గోప్యత, పారదర్శకత, బాధ్యతాయుతమైన సేవలకు ప్రాధాన్యమిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. వైద్య నిర్ణయాలు అర్హత కలిగిన వైద్యుల సలహా మేరకే తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు.తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ సేవలు అందించేందుకు చిరుసేవ పేషెంట్ సర్వీసెస్ సిద్ధంగా ఉందని సంస్థ వెల్లడించింది. వైద్య సేవలను పొందే ప్రక్రియను సులభతరం చేసి, అవసరమైన సమయంలో రోగులకు అండగా నిలవడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంది.వివరాలకు: 9642908108

కోరుట్లలో కత్తితో హత్యాయత్నం.. ముగ్గురు నిందితుల అరెస్ట్

- దుర్గామాత నిమజ్జన వేడుకల్లో చెలరేగిన వివాదం
- రాజేందర్ పై కత్తితో దాడి చేసి పరారైన వైనం
- నిందితులను రిమాండ్ కు తరలించినట్లు సీఐ తిరుపతి వెల్లడి

ప్రజా వాయిస్, కోరుట్ల: కోరుట్ల పట్టణంలో దసరా పండుగ సందర్భంగా చోటుచేసుకున్న గొడవలో ఓ వ్యక్తిపై కత్తితో హత్యాయత్నం చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గుద్దేటి రాజేందర్ (43) తన కాలనీలో దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల సమయంలో రామ్ నగర్ కాలనీకి చెందిన కిరణ్ (19), అజయ్ (19)లతో ఆయనకు గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 21వ తేదీ తెల్లవారుజామున సుమారు 03:00 గంటలకు కిరణ్, అజయ్‌లు మరో నిందితుడు జ్ఞానదీప్ (20)తో కలిసి అర్బన్ కాలనీలోని దుర్గామాత ఆలయం వద్దకు వచ్చి రాజేందర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కిరణ్, అజయ్‌లు రాజేందర్‌ను గట్టిగా పట్టుకోగా.. జ్ఞానదీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో రాజేందర్ ఎడమ భుజం, మెడ ఎడమ వైపు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించగా, వారు కత్తితో బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కోరుట్ల పోలీసులు.. నిందితులు కిరణ్, అజయ్, జ్ఞానదీప్‌లను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పండుగల సమయాల్లో ప్రజలు సంయమనం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. తిరుపతి, ఎస్సై జి. శ్యామ్ రాజ్ హెచ్చరించారు.

అలై బలైతో ఐకమత్యాన్ని చాటిన గుల్లపు మచ్చేందర్

- ఘనంగా దసరా సంబరాలు
- నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆత్మీయంగా అలై బలై వేడుకలు
- ప్రజలతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నేత జీఎంఆర్
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఆప్యాయతల కలయిక

ప్రజా వాయిస్ నారాయణఖేడ్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ప్రజల మధ్య ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే అలై బలై వేడుకలు నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సంబరాల్లో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గుల్లపు మచ్చేందర్ (జీఎంఆర్) పాల్గొని ప్రజలతో ఐకమత్యాన్ని చాటారు.నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలతో ఆయన మమేకమయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించిన గుల్లపు మచ్చేందర్, పండుగ ఉత్సాహాన్ని వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా కులమతాలకు, వర్గాలకు అతీతంగా సాగిన ఈ అలై బలై కార్యక్రమం ప్రజల మధ్య సోదరభావాన్ని చాటిచెప్పింది.విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సంతోషాలు నింపాలని ఈ సందర్భంగా జీఎంఆర్ ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ఇలాంటి అద్భుతమైన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే.. నియోజకవర్గ ప్రజలందరూ ఎల్లప్పుడూ ఇదే ప్రేమాభిమానాలతో, ఐకమత్యంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

మిర్యాలగూడలో మాయమవుతున్న మూలాలు

- బొడ్రాయి ప్రతిష్ఠాపనపై నిర్లక్ష్యమేల
- గ్రామాల్లో పండుగ వాతావరణం
- పట్టణంలో మాత్రం మౌనమేల
- సంప్రదాయాల పరిరక్షణపై ప్రశ్నిస్తున్న మేధావులు, పట్టణ ప్రజలు
- ఇంకెన్నాళ్ళు ఈ స్పందన లేనితనం.. స్పష్టతనిచ్చేదెవరు..

పల్లెలు తమ సంస్కృతిని కాపాడుకుంటుంటే, పట్టణంలో మాత్రం మన ఆచారాలు మరుగున పడిపోవాల్సిందేనా.. దీనిపై అధికారులు, పాలకులు స్పందించి స్పష్టమైన ప్రకటన ప్రకటించే వరకు 'ప్రజా వాయిస్' తరపున పోరాటం ఆగదు..మిర్యాలగూడ ప్రజల గొంతుక ఇదే.. మన బొడ్రాయి ప్రతిష్ఠాపన ఎప్పుడు

ప్రజా వాయిస్, మిర్యాలగూడ.. ఒక ఊరు ఉందంటే అక్కడ ఆచారం ఉండాలి, ఆచారం ఉందంటే దానికి మూలమైన 'బొడ్రాయి' ఉండాలి.. కానీ, దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతున్న మిర్యాలగూడ పట్టణంలో మాత్రం మన సంస్కృతికి ప్రతీక అయిన బొడ్రాయి ప్రతిష్ఠాపన అంశం ఎక్కడికక్కడ అటకెక్కింది. చుట్టుపల్లెల్లో చిన్న గ్రామాలు సైతం ఐక్యతతో బొడ్రాయి వేడుకలను కన్నుల పండువగా నిర్వహిస్తుంటే, లక్షలాది జనాభా కలిగిన ఉమ్మడి నల్గొండ జిల్లాల ప్రధాన వాణిజ్య కేంద్రమైన మిర్యాలగూడలో ఈ అంశంపై కనీస చర్చ కూడా జరగకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణ ప్రజల ఆత్మగౌరవ ప్రశ్న..

పల్లెటూర్లలో ఏ చిన్న కష్టమొచ్చినా, గ్రామానికి ఎలాంటి అరిష్టం రాకుండా కాపాడే రక్షణ కవచంగా బొడ్రాయిని భావిస్తారు. కులమతాలకు అతీతంగా ఊరంతా ఒక్కటై ఈ వేడుకను మహా జాతరలా జరుపుకుంటారు. మరి పట్టణంగా మారుతున్న మిర్యాలగూడలో మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఎవరిది..కేవలం వ్యాపారాలు, రాజకీయాలు, భవనాల నిర్మాణాలకే పట్టణం పరిమితం కావాలా..మన మూలాలను గుర్తుచేసే ఇలాంటి సాంస్కృతిక వైభవాన్ని పట్టణంలో ఎందుకు విస్మరిస్తున్నారు..అనే ప్రశ్నలు ఇప్పుడు మేధావుల నుంచి సంధించబడుతున్నాయి.

ప్రజాప్రతినిధుల మౌనం వెనుక మర్మమేంటి

ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగే నాయకులకు.. ప్రజల ఆచార సంప్రదాయాల పరిరక్షణను గుర్తుచేసే సమయం లేదా బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం ఇప్పటివరకు ఏ ఒక్క ప్రజాప్రతినిధి అయినా నోరు విప్పారా.. మున్సిపల్ అధికారులతో లేదా స్థానిక పెద్దలతో దీనిపై కనీసం ఒక సమీక్షా సమావేశమైనా నిర్వహించారా.. స్థల సేకరణ లేదా శాస్త్రోక్త ఏర్పాటుపై మీ వద్ద ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా? అంటూ మిర్యాలగూడ ప్రజలు నిలదీస్తున్నారు.ఇది కేవలం ఒక రాయిని ప్రతిష్ఠించే తంతు కాదు, పట్టణ ప్రజల ఐక్యతకు నిదర్శనం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు ప్రముఖులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. కేవలం హామీలతో కాలయాపన చేయకుండా, మిర్యాలగూడ గడ్డపై బొడ్రాయి ప్రతిష్ఠాపనకు కార్యాచరణ ప్రకటించాలి.

కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డులో గంజాయి పట్టివేత

- 5.232 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్.

ప్రజా వాయిస్ రెబ్బేన/ కాగజు నగర్.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనికాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద రెబ్బెన పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 5.232 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ విలువ సుమారు రూ.2.70 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ వెల్లడించారు. అక్టోబర్ 19న ఈ ఘటనకు సంబంధించి రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరెస్టయిన వారిని కాగజ్‌నగర్‌లో నివసిస్తున్న జుముర్ గెయిన్ (33), ఆమె భర్త సురంజన్ గెయిన్ (46)గా గుర్తించారు.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం జుముర్ గెయిన్ ఈ నెల 14న ఒడిశాకు వెళ్లి పింటూ అనే వ్యక్తి వద్ద రూ.15 వేలతో గంజాయి కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కాగజ్‌నగర్‌కు తిరిగి వస్తుండగా ఆమె భర్త స్కూటీపై వేచి ఉన్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ వ్యవహారంలో ఒడిశాకు చెందిన పింటూతో పాటు మంచిర్యాలకు చెందిన మున్నీ, జైపూర్‌కు చెందిన చంద్రశేఖర్, రాజు తదితరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసును ఛేదించిన ఆసిఫాబాద్ డీఎస్పీ బి. అశోక్, ఇన్‌చార్జి రెబ్బెన సీఐ వేణుగోపాల్, రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ, పోలీసు సిబ్బందిని అభినందించారు.

నీటి చుక్కే రేపటి జీవనానికి రక్ష

- నీరు ఉంటేనే జీవం.. నీటిని కాపాడితేనే భవిష్యత్తు!
- ఎల్ నినోను ఎదుర్కొందాం.. నీటిని ఆదా చేద్దాం!
- వర్షాభావ పరిస్థితులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం
- ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి భవిష్యత్తును కాపాడుదాం

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, వర్షపాతంలో హెచ్చు తగ్గులు.. ఇవన్నీ మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంపై చర్చ పెరుగుతున్న వేళ నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం ప్రతి ప్రాంతంలో ఒకేలా ఉండదు. అయితే పరిస్థితి ఎలా ఉన్నా నీటిని పొదుపు చేయడం మనందరి బాధ్యత.

ఎల్ నినో అంటే ఏమిటి?

పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా మారే వాతావరణ పరిస్థితిని ఎల్‌నినో అంటారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశలు, వర్షపాత సరళులు, ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతుంది. భారతదేశంలో రుతుపవనాల వర్షాలకు ఎల్‌నినో కొన్ని సందర్భాల్లో ప్రతికూలంగా మారవచ్చు. అయితే ప్రతిసారీ కరువు వస్తుందని చెప్పలేం. ఇతర వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి.

నీటి కొరత.. రైతులకు పెను సవాల్

వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గే ప్రమాదం ఉంది. భూగర్భ జల మట్టాలు పడిపోవడంతో బోరుబావులపై ఆధారపడే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. పంటలకు నీటి లభ్యత తగ్గితే దిగుబడులపై ప్రభావం పడవచ్చు. పశువులకు తాగునీరు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కూడా సవాల్‌గా మారవచ్చు. అందువల్ల సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మేలు.

ప్రతి ఇంట్లో నీటి పొదుపు అవసరం

నీటి సంరక్షణ ప్రభుత్వాలకే పరిమితమైన కార్యక్రమం కాదు. ప్రతి కుటుంబం తమ వంతు బాధ్యతగా భావించాలి. కుళాయిలను అవసరం లేనప్పుడు తెరిచి ఉంచకూడదు. నీటి లీకేజీలను వెంటనే అరికట్టాలి. వాహనాల శుభ్రత, ఇంటి పరిసరాల పరిశుభ్రత కోసం సాధ్యమైనంత తక్కువ నీటిని వినియోగించాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు వినియోగించవచ్చు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి.

వ్యవసాయంలో నీటి వినియోగంపై అవగాహన

నీటి కొరతను ఎదుర్కొనేందుకు రైతులు పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగించే పద్ధతులను అనుసరించాలి. సాధ్యమైన చోట బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలి. నేలలో తేమను కాపాడే పద్ధతులు పాటించాలి. ప్రాంతానికి అనుకూలమైన, తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు, కాలువల్లో పూడికతీత చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా పొలాల్లో ఇంకేలా చర్యలు తీసుకోవాలి.

గ్రామాల స్థాయిలో సమష్టి కార్యాచరణ

గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. పాడైపోయిన నీటి పైపుల మరమ్మతులు, చెరువుల పరిరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, చెట్ల పెంపకం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తాగునీటి వనరులను కలుషితం కాకుండా కాపాడాలి. నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి గ్రామంలో నీటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

నేటి పొదుపే.. రేపటి భద్రత

నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వనరు. దానిని వృథా చేయడం అంటే భవిష్యత్తు తరాల అవసరాలను నిర్లక్ష్యం చేయడమే. ఎల్‌నినో ప్రభావం ఎంతవరకు ఉంటుందనే దానిపై అంచనాలు మారవచ్చు. కానీ నీటి అవసరం మాత్రం ఎప్పటికీ మారదు. అందుకే వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడే నీటిని నిల్వ చేసుకోవాలి. వర్షాలు తగ్గినప్పుడు పొదుపు చర్యలను మరింత కఠినంగా పాటించాలి.ఎల్‌నినోను ఎదుర్కోవడానికి భయపడటం కాదు.. ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావడం ముఖ్యం. నీటిని ఆదా చేయడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను పెంపొందించడం మనందరి బాధ్యత. ప్రతి చుక్కను కాపాడితేనే భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించగలం.

నిరుపేదలకు సీఎం సహాయ నిధి భరోసా

- మాజీ ఎంపీటీసీ బండారు దేవేందర్

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఒక కొండంత అండగా నిలుస్తోందని మాజీ ఎంపీటీసీ బండారు దేవేందర్ పేర్కొన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నీరుడి సులోచనకు రూ.27 వేలు, బండారు సుగుణకు రూ.18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులు భరించలేక సతమతమవుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధతో నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాయిలు, వేణు, రోషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోట్ల విలువచేసే అక్రమ కలప రవాణా

- మంజీరా పరిహక ప్రాంతంలో టెండర్ వేయకుండానే అడ్డగోలుగా అక్రమంగా చెట్ల నరికివేత
- వ్యాపారులతో ఫారెస్ట్ అధికారుల కుమ్మక్కు

ప్రజా వాయిస్,సంగారెడ్డి : మంజీరా పరిహాక ప్రాంతంలో కోట్ల విలువ చేస్తే చెట్లను అడ్డగోలుగా టెండర్ వేయకుండానే అధికారులు అక్రమ వ్యాపారులకు అప్పగిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఇదంతా సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, పుల్కల్ మండల పరిధిలోని మంజీరా నది పరిహాక ప్రాంతంలో ఏపుగా పెరిగిన చెట్లను అడ్డగోలుగా నరికి వేస్తూ లక్ష రూపాయలు అర్జిస్తున్నారు. నిబంధనల ప్రకారం మంజీరా పరిహక ప్రాంతంలో చెట్లను నరకాలంటే ముందుగా టెండర్లను ఆహ్వానించాలి. అత్యధిక పాట ఎవరైతే పేర్కొంటారో వారికే టెండర్లు ఇచ్చి చెట్లు నరికేందుకు అనుమతిస్తారు. కానీ కొందరు ఫారెస్ట్ అధికారులు కల్ప అక్రమ వ్యాపారం చేసే వారితో కుమ్మక్కై టెండర్ వేయకుండానే అడ్డగోలుగా చెట్లను వేతకు అనుమతిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఇదంతా సదాశివపేట మండలం నిజాంపూర్, కోల్కూర్, వెల్టూరు గ్రామ శివారుల మధ్య ఏపుగా పెరిగిన వివిధ రకాల చెట్లను నరికివేస్తూ ఈ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఎవరైనా జర్నలిస్టులు ప్రశ్నించేందుకు వెళితే మాకు అన్ని అనుమతులు ఉన్నాయి....మీరెవరు రావడానికి అంటూ దాడి చేసే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రం టెండర్ వేశాకే చెట్లు నరకడం ప్రారంభించాలి. అదేమీ లేకుండానే యంత్రాలతో రాత్రికి రాత్రి ట్రాక్టర్ల కొద్ది చెట్లలను నరికి వేసి అడ్డగోలుగా లక్షల్లో సంపాదిస్తున్నారు. దీనిపై రిజర్వ్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇస్తే తమకు దీనిపై ఇంతవరకు సమాచారం రాలేదని... పరిశీలించి చర్యలు తీసుకుంటామంటూ దాటేస్తున్నారు. గత మూడు నెలలుగా అక్రమంగా చెట్ల నరికివేత వ్యవహారం కొనసాగుతున్న ఫారెస్ట్ అధికారులకు తెలియడం లేదంటే వారి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రజలు ఫారెస్ట్ జిల్లా అధికారులు అక్రమ వ్యాపారులతో కుమ్మక్కైనందున కలెక్టర్ జెక్యం చేసుకొని అక్రమ కలప వ్యాపారులపై దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,ఎస్పీ స్నేహ మెహ్రా

ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో: దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా పోలీసు కవాతు మైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలు దేశ భద్రతకు పునాది అని పేర్కొన్నారు. పోలీసు అధికారులు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు రక్షణ కల్పించాలని సూచించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సమస్యలకు చట్ట పరిధిలో న్యాయం అందించాలని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం అదనపు ఎస్పీ రాజేశ్ మీనా 2025 సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అధికారులు స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.పోలీసు పతాక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉప పరిశీలకుల స్థాయిలో మీనాక్షి, ఎం. ప్రశాంత్ వర్ధన్, బి. మోహన కృష్ణ వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. కానిస్టేబుళ్ల నుంచి సహాయ ఉప పరిశీలకుల స్థాయి విభాగంలో జె. ప్రత్యూష, బి. సంతోష్, సీహెచ్. దీపిక వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య కంటే ఈవెంట్లు, సినిమా ప్రమోషన్లకే ప్రాధాన్యతా

- ఎంవీఎస్ఆర్ కళాశాలలో సోనా మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలి
- రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి:
- సురేష్ యాదవ్

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన యాజమాన్యాలు అందుకు భిన్నంగా ఈవెంట్లు, సినిమా ప్రమోషన్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం దురదృష్టకరమని బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ కళాశాలలో దాండియా కార్యక్రమం సందర్భంగా లైటింగ్ సిస్టమ్ కూలిపడి సోనా మృతి చెందిన ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు.విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా కళాశాల యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోనా మృతికి దారితీసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.ప్రైవేట్ విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థుల ప్రాణాల కంటే ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితులు మారాలని, భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం

- సంచార ముస్లిం తెగల సంఘం
- మేనిఫెస్టోలో ఇచ్చిన కార్పొరేషన్ ఏర్పాటు హామీ ఏమైంది?
- ఏటా రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్
- మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క హామీ అమలు కాలేదంటూ ఆగ్రహం

ప్రజా వాయిస్, కోరుట్ల: తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన సంచార ముస్లిం తెగల (బీసీ–ఈ 1–14) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కోరుట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సంచార ముస్లింలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ–ఈ వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, ప్రతి సంవత్సరం రూ.1,000 కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని సంఘం నాయకులు గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, తమకు ఇచ్చిన ప్రధాన హామీలు ఏ ఒక్కటి కూడా అమలులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు.★ సంచార ముస్లింల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.★ ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.★ విద్యార్థులకు రూ.5 లక్షల వరకు స్కాలర్‌షిప్ అందిస్తామన్న హామీని అమలు చేయాలి.★ బీసీ–ఈ వర్గాల సమగ్ర గణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి.★ అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి.సంచార ముస్లిం తెగలు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం వంటి రంగాల్లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇతర బీసీ సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం ఫౌండర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ షబ్బీర్, సలహాదారు షేక్ మహమ్మద్ ముజాహిద్, జిల్లా అధ్యక్షుడు ఎండీ షాంసోద్దీన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇబ్రహీం, ఆడహక్ అధ్యక్షుడు షాహిద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల చిత్రపటాల దహనం

- కొహెడలో ఆరుగురిపై పోలీసుల కేసు నమోదు

ప్రజా వాయిస్ కోహెడ హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మసాగర్‌పల్లి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన ఆరుగురు వ్యక్తులపై పోలీసులు చట్టరీత్యా కేసు నమోదు చేశారు. ఈ మేరకు హుస్నాబాద్ ఏసీపీ సదానందం వివరాలు వెల్లడించారు.గ్రామ సర్పంచ్ కరివేద చంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, అక్టోబర్ 20వ తేదీ రాత్రి దసరా పండుగ వేడుకల సందర్భంగా ధర్మసాగర్‌పల్లి గ్రామంలోని హనుమాన్ గుడి వద్ద కొందరు యువకులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా అక్రమంగా గుమికూడారు. గ్రామంలో వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా, ప్రజల మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు బీసీ సంక్షేమ, రవాణా శాఖామాత్యులు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చిత్రపటాలు ఉన్న ఫ్లెక్సీని రావణాసురుని రూపంలో తయారు చేయించారు. కోహెడలోని మణికంఠ ఫ్లెక్సీ ప్రింటర్ షాపు నిర్వాహకుడు ఎం.డి. ఆరిఫ్ సాయంతో ఈ ఫ్లెక్సీని ముద్రించి, దాన్ని కట్టెలకు కట్టి, గడ్డి పెట్టి నిప్పు అంటించి దహనం చేశారు. అంతేకాకుండా ఈ దృశ్యాలను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడం ద్వారా ప్రజల మధ్య పగలు పెంచేందుకు, గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారు.ఈ ఘటనకు సంబంధించి ధర్మసాగర్‌పల్లికి చెందిన పోతరవేణి రాకేష్, లోనే హరీష్, మొతుకురు శ్రీకాంత్, గొండ అజయ్ కుమార్ అలియాస్ అభి, బండ అభిషేక్ మరియు మణికంఠ ఫ్లెక్సీ ప్రింటర్స్ నిర్వాహకుడు ఎం.డి. ఆరిఫ్లపై కోహెడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏసీపీ తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, రాజకీయ ఉద్రిక్తతలు లేదా వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా, అశాంతికి గురిచేసినా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఖాకీ వెనుక త్యాగాల చరిత్ర..
అమరుల సేవలకు సెల్యూట్

- నల్లగొండ జిల్లాలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- జిల్లాలో విధి నిర్వహణలో 15 మంది పోలీసుల వీరమరణం.
- అమరులైన పోలీసుల సేవలు చిరస్మరణీయం
- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్

ప్రజా వాయిస్, నల్లగొండ: ఖాకీ దుస్తుల వెనుక ఎన్నో త్యాగాలు.. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని ధైర్యసాహసాలు.. దేశ రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ అమరులైన పోలీసుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొని వీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకిత భావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో 15 మంది పోలీసుల వీరమరణం

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది 154 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసినట్లు వెల్లడించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు. వారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

అమరవీరుల కుటుంబాలకు గౌరవాభివందనం

దేశ రక్షణ కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులందరికీ ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు గౌరవాభివందనాలు తెలియజేస్తూ, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. సమాజ శ్రేయస్సు, ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ కె. శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ప్రజా వాయిస్/దుబ్బాక : విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని దుబ్బాక ఎస్సై కీర్తి రాజు అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ అమర వీరులుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుబ్బాకలో అమరవీరుల కుటుంబ సభ్యులు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎస్ఐ కీర్తి రాజు మాట్లాడుతూ... పోలీసు శాఖ రోజుకు 24 గంటలూ ప్రజలకు సేవలందించే విభాగమని తెలిపారు. పండుగలు, సెలవులతో సంబంధం లేకుండా పోలీసులు విధులు నిర్వర్తిస్తూ ప్రజల భద్రత కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యం జరిపిన దాడిలో వీరమరణం పొందిన పోలీసుల త్యాగాలకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అమరవీరుల కుటుంబ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలను శాఖ ఎన్నటికీ మరచిపోదని స్పష్టం చేశారు. అమరవీరుల కుటుంబాలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా పోలీసు శాఖ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.దేశవ్యాప్తంగా 154 మంది పోలీసుల ప్రాణత్యాగం ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులైనట్లు తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 154 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లను చదివి వినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల సేవలు ఆదర్శప్రాయమని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోనాయిపల్లి దళితులపై దాడి..
సర్పంచ్, అనుచరులను అరెస్టు చేయాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్
- కనీస వేతనం అడిగినందుకు దాడి చేయడం దారుణం
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి
- బాధితులకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పీటీ కోనాయిపల్లిలో బతుకమ్మ పండుగ సందర్భంగా దళితులపై దాడికి పాల్పడ్డారనే ఆరోపణలపై గ్రామ సర్పంచ్ మన్నె కళ్యాణ్‌తో పాటు సంబంధిత వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డప్పులు కొట్టేందుకు కనీస వేతనం అడిగినందుకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడి జరగడం దారుణమని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, గాయాల వివరాలను నమోదు చేసి, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు తగిన వైద్యం, రక్షణ కల్పించడంతోపాటు దర్యాప్తును నిష్పక్షపాతంగా నిర్వహించాలని పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిని రాజకీయ ఒత్తిళ్లతో కాపాడే ప్రయత్నాలను సహించబోమని, బాధితులకు న్యాయం జరగకపోతే దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని దాసరి ఏగొండ స్వామి హెచ్చరించారు. కోనాయిపల్లి ఘటనకు నిరసనగా మెదక్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో ప్రజాస్వామికవాదులు, దళిత సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు నర్సింలు, యాదగిరి, చంద్రం పాల్గొన్నారు.

బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

- 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యత లేని, పురుగులు పట్టిన ఆహారం
- ఆసుపత్రే, కొత్త రోగాలను తెచ్చిపెట్టేలా తయారైంది
- ఆరోగ్యంగా ఉన్నవాడు కూడా రోగిగా మారక తప్పదని ప్రజలు ఆరోపణ.

ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణము లోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. రోగాలను నయం చేయాల్సిన ఆసుపత్రే, కొత్త రోగాలను తెచ్చిపెట్టేలా తయారైందని ప్రజలు వాపోతున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యత లేని, పురుగులు పట్టిన ఆహారాన్ని వడ్డిస్తుండటంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా, కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారంటూ ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో రోగులకు పోషకాహారం అందించాలన్నది నిబంధన. కానీ ఇక్కడ వడ్డిస్తున్న భోజనం చూస్తే ఆరోగ్యంగా ఉన్నవాడు కూడా రోగిగా మారక తప్పదు. మెతుకులు సరిగ్గా ఉడకని అన్నం, నీళ్ల చారును తలపించే పప్పు, కూరల్లో పురుగులు వస్తున్నాయని రోగులు వాపోతున్నారు. నాణ్యత లేని ఈ ఆహారాన్ని తినలేక, బయట కొనుక్కునే స్తోమత లేక పేద రోగులు ఆకలితో అలమటిస్తున్నారు. ఇది బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న దారుణ పరిస్థితి. పేదల ఆరోగ్యంతో ఇక్కడి కాంట్రాక్టర్లు, పర్యవేక్షించాల్సిన అధికారులు చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి, ఈ ఆహార నాణ్యతపై తనిఖీలు చేపట్టాలి. రోగులకు మెరుగైన, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలి. లేదంటే రోగుల ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆసుపత్రికి వచ్చే రోగులు మరియు వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

యాదాద్రి వైన్స్‌లో 'ఇష్టారాజ్యం'

- ఎమ్మార్పీ ఉల్లంఘనలపై ఆరోపణలు
- బెల్టు షాపులకు మద్యం సరఫరా.?
- నివాసాల మధ్య పర్మిటెడ్ రూములు
- పారిశుధ్యంపై ఫిర్యాదులు.. అధికారుల తనిఖీలేవీ.?

ప్రజా వాయిస్ / బీబీనగర్:యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలోని యాదాద్రి వైన్స్ నిర్వహణపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల అమలు, విక్రయాల తీరు, పర్మిటెడ్ రూముల నిర్వహణ, పారిశుధ్యం వంటి అంశాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కూల్ డ్రింక్స్ పై అధిక వసూళ్లు.?

వైన్స్‌కు వచ్చే వినియోగదారులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు కూల్‌డ్రింక్స్, సాఫ్ట్‌డ్రింక్స్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించి స్పష్టత ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

నివాసాల మధ్యే పర్మిటెడ్ రూములు.!

కుటుంబాలు నివసించే ఇళ్ల మధ్యలోనే వైన్స్‌కు సంబంధించిన పర్మిటెడ్ రూములు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో స్థానిక నివాసితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. అనుమతులు, నిబంధనల అమలుపై సంబంధిత అధికారులు పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉంది.

గ్రామాలకు మద్యం సరఫరా.?

చుట్టుపక్కల గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం సరఫరా అవుతోందనే ఆరోపణలు మరోవైపు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

పారిశుధ్యం ఏదీ.?

వైన్స్‌లోని టాయిలెట్ల నిర్వహణ సరిగా లేకపోవడం, దుర్వాసనతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. కనీస పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల తనిఖీలు ఎప్పుడో.?

యాదాద్రి వైన్స్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎక్సైజ్, మున్సిపల్ అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఎమ్మార్పీ ఉల్లంఘనలు, పర్మిటెడ్ రూముల నిర్వహణ, బెల్టు షాపులకు మద్యం సరఫరా, పారిశుధ్యంపై విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

వృద్ధురాలి దారుణ హత్య!

- ఆభరణాల కోసమే హత్య చేశారా?
- పోలీసుల దర్యాప్తు

ప్రజా వాయిస్ | హుజూర్ నగర్ |అక్టోబర్ 21సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు సుందరయ్య నగర్ కాలనీకి చెందిన మామిడి రాములమ్మ (74) హత్యకు గురయ్యారు. వృద్ధురాలి వద్ద ఉన్న బంగారు ఆభరణాల కోసమే ఈ హత్య జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ పోలీసు సిబ్బందితో కలిసి వివరాలు సేకరిస్తున్నారు. వృద్ధురాలి హత్యకు గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



ఆలయాల పేరుతో అక్రమ వసూళ్లు..!

- దేవుడు పేరుతో.. దయ్యంలా వసూళ్లు...!
- దేవదాయ శాఖ ఆధీనంలో లేవు
- పట్టించుకునే నాథుడు లేడు

ప్రజా వాయిస్ / దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గం లోని దేవుడి పేరు చెప్పి అక్రమ వసూలు చేస్తున్న వైనం.. దుబ్బాకలో ప్రధానమైన ఆలయాలు ఉన్న దేవాదాయ శాఖ పట్టించుకోకపోవడం నిమ్మకు నీరెత్తిగా ఉన్నది. దుబ్బాక నియోజకవర్గంలో ప్రధానమైన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఒకటి రెండు ఆలయాలను దేవాదాయ శాఖ గుర్తించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుబ్బాక నియోజకవర్గంలో ఉన్న ప్రధాన ఆలయాలను ఆలయాలు అభివృద్ధి చెందాయని ప్రజలు కోరుతున్నారు దేవాదాయ శాఖ ఆ దినంలోకి తీసుకోవాలని పలువురు అంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉంటే ఆలయాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు అంటున్నారు.

లీకేజీతో మిషన్ భగీరథ తాగునీరు వృథా.. అధికారులకు పట్టదా..!

- పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- రోడ్డు పక్కన నీరు నిల్వ.. వాహనదారులకు ఇక్కట్లు
- నీటి ఎద్దడి ముప్పు పొంచి ఉన్నా మరమ్మతుల్లో నిర్లక్ష్యం

ప్రజా వాయిస్, తెలకపల్లి: తెలకపల్లి మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది. నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారికి ఎడమవైపు గత కొద్ది రోజులుగా నీరు లీకవుతూ రోడ్డుపక్కన నిలిచిపోతోంది. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వృథాను అరికట్టాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

పైపులైన్ లీకేజీ విషయాన్ని స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ పలుమార్లు మిషన్ భగీరథ అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఫోన్ ద్వారా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల ద్వారా మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

నీటి ఎద్దడి వేళ వృథా ఏమిటి.?

రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఎదురైతే తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించాల్సింది పోయి, పైపులైన్ లీకేజీతో వృథా చేస్తుండటం బాధాకరమని అంటున్నారు. ఈ లీకేజీ కారణంగా రోజుకు వేల లీటర్ల నీరు వృథా అవుతోందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఆ నీటితో ఎన్నో కుటుంబాల దాహార్తిని తీర్చవచ్చని పేర్కొంటున్నారు.

రోడ్డుపై గుంతలు.. దోమల బెడద

లీకేజీ నీరు రోడ్డుపక్కన నిలిచిపోవడంతో అక్కడ గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వ నీటితో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో పలుమార్లు లీకేజీలు ఏర్పడ్డాయని, తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే లీకేజీని సరిచేయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. మండల అభివృద్ధి అధికారి కూడా ఈ సమస్యపై దృష్టి సారించి సంబంధిత అధికారులతో మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాగునీటి వృథాను అరికట్టి నిరంతర నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఐదేళ్ల విరామం అనంతరం కామారెడ్డిలో వైభవంగా దసరా ఉత్సవాలు

- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి
- సలహాదారులు షబ్బీర్షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీలతో ఘనంగా దసరా వేడుకలు

ప్రజావాయిస్ కామారెడ్డి/ కామారెడ్డి పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి, మాజీ ప్రతిపక్ష నేత మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఐదేళ్ల అనంతరం కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియం లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున బాణాసంచా పేల్చారు. వందల మంది ప్రజలను లేజర్ షో విశేషంగా ఆకట్టుకుంది రావణ దహనం కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆసక్తిగా తిలకించారు. గత 30 ఏళ్ల నుండి కొనసాగిన దసరా ఉత్సవాలు ఐదేళ్లుగా నిలిచిపోయాయి మళ్ళీ ఈ సంవత్సరం షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. లేజర్ షో, రావణ దహన పురస్కరించుకుని పాత ఏడో నెంబర్ జాతీయ రహదారి ప్రజలతో కిక్కిరిసిపోయింది. దసరా ఉత్సవాలను కామారెడ్డి వాసులు పరిసర గ్రామాల ప్రజలు ఉత్సాహంగా తిలకించి దసరా ఉత్సవాలను జరుపుకున్నారు.మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ,కామారెడ్డి పట్టణంలో గత 36 సంవత్సరాలుగా షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా కలిసిమెలిసి పండుగలను జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.కరోనా మహమ్మారి ప్రభావం, ఇతర పరిస్థితుల కారణంగా గత ఐదేళ్లుగా దసరా ఉత్సవాలను నిర్వహించలేకపోయామని తెలిపారు. ఐదేళ్ల విరామం తర్వాత ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, సహకారం ఈ ఉత్సవాల విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

గ్రామంలో బల ప్రదర్శనకు బడ్డీలే దిక్కయ్యాయా?

- చిల్లర బడ్డీలకు మంత్రి పేరు వాడుతున్నారా?:
- మండల నేతల తీరుపై సొంత పార్టీ శ్రేణుల ఆగ్రహం!
- స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- కూలీలు కూర్చునే బల్లాలను తొలగించడంతో రోడ్డుపై నిరసనలు
- ఒకరు వెయ్యమంటారు.. ఇంకొకరు తీయమంటారు:
- నేతల మధ్య నలిగిపోతున్న పంచాయతీ పాలన!

ప్రజా వాయిస్ ఖమ్మం:ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రోగుల ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రి మార్గం కాస్తా.. స్థానిక నాయకుల వర్గ విభేదాలు, ఆధిపత్య పోరుకు అడ్డాగా మారడంపై మండల ప్రజలు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొన్నేళ్ల క్రితం నేలకొండపల్లి ప్రధాన రహదారి విస్తరణ చేపట్టిన సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారుల బడ్డీలను, దుకాణాలను అధికారులు ఖాళీ చేయించారు. కొన్నేళ్లుగా ఈ మార్గంలో రాకపోకలు సజావుగానే సాగాయి. అయితే, ఇటీవల అధికార పార్టీలోని కొందరు నాయకులు తమ వర్గ బలాన్ని చాటుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన ముఖద్వారం పక్కనే ఓ బడ్డీ కొట్టును ఏర్పాటు చేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిని అదే పార్టీకి చెందిన మరో నేత తీవ్రంగా వ్యతిరేకించడంతో రగడ మొదలైంది. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా, ఈ ఆధిపత్య పోరులో భాగంగా అదును చూసుకొని వరుసగా ఐదు నుంచి ఆరు బడ్డీ కొట్లను అక్రమంగా ఏర్పాటు చేయించారు.ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈ రహదారి ఎస్సీ, బీసీ కాలనీలకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డును ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయడంతో: అత్యవసర సమయాల్లో వచ్చే 108, ప్రైవేట్ అంబులెన్సులు ముందుకు కదలలేక నిలిచిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతంలో నిత్యం కూలీ పనుల కోసం వచ్చే కార్మికులు, స్థానికులు కూర్చోవడానికి వేసిన బల్లాలను కొత్తగా వెలిసిన దుకాణదారులు పక్కకు నెట్టేయడంతో కార్మికులకు, వ్యాపారులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన గ్రామస్తులు, కూలీలు ఆ బల్లాలను రోడ్డుకు అడ్డంగా వేసి వాహనాల రాకపోకలను పూర్తిగా స్తంభింపజేసి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి , నేలకొండపల్లి ఎస్సై తమ సిబ్బందిని పంపించి ఆందోళనకారులతో మాట్లాడి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని, రోడ్డుపై అడ్డంకులను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది.ఇదిలా ఉంటే, ఈ అక్రమ ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో కార్యాలయాలకు స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయనీ . అయితే, నాయకుల తీరు అధికారులను నిస్సహాయులను చేస్తోంది. ఒక నాయకుడు బడ్డీలను వెంటనే తొలగించాలి అని ఒత్తిడి తెస్తుంటే, మరో నాయకుడు తొలగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.చిన్న చిన్న స్వప్రయోజనాల కోసం, వీధి బడ్డీల పంచాయతీకి ఏకంగా రాష్ట్ర మంత్రిగారి పేరు చెప్పుకుంటూ అధికారులపై పెత్తనం చెలాయించే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం. ఇలాంటి చర్యల వల్ల గ్రామంలో పార్టీ ప్రతిష్ట, మంత్రిగారి పరువు బజారున పడుతోందని సొంత పార్టీ శ్రేణులే బహిరంగంగా అసహనం వ్యక్తం చేస్తున్నాయి.రోగులు, ప్రజల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న ఈ అక్రమ దుకాణాలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనపెట్టి, మంత్రి పేరును అడ్డం పెట్టుకుని చేసే విన్యాసాలకు స్వస్తి పలకాలని హితవు పలుకుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆసుపత్రి మార్గంలో ఉన్న ఆక్రమణలను శాశ్వతంగా తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు.

దసరా రోజు పినపాక గడ్డపై బి ఆర్ ఎస్ పార్టీ జోరు!

- బయ్యారం క్రాస్ రోడ్డు లో నూతన పార్టీ కార్యాలయం ప్రారంభించిన రేగ
- వందల సంఖ్యలో హాజరైనా కార్యకర్తలు మండల నాయకులు
- కార్యకర్తలతో కలిసి చిందులు వేసిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

ప్రజా వాయిస్ పినపాక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ గడ్డపై బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు గెలుపు సాధించడం ఖాయమనే సంకేతాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ. ప్రభుత్వంలో పాయం వెంకటేశ్వర్ల పాలనలో మూడు సంవత్సరాల పాటు అభివృద్ధి లేకపోవడం కారణంగా విసిగిపోయిన ప్రజల ఆలోచనలు మరోసారి మార్పు కోరుకుంటున్నట్లు తెలుస్తుంది. బి ఆర్ ఎస్ పార్టీ రాజకీయ వూహాలు గ్రామ గ్రామంలో బలంగా విస్తరిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడుల్ల బయ్యారం క్రాస్ రోడ్డు వద్ద నూతన బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం విజయదశమి రోజునే ప్రారంభోత్సవం కావడం, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వందలాది మంది కార్యకర్తలు, మండల నాయకులు పండగ వేల స్వచ్ఛందంగా రావడం ఆశ్చర్యానికి గురిచేసింది, ఉదయం 10 గంటలకు బయ్యారం క్రాస్ రోడ్ చేరుకున్నారు తదుపరి వేద మంత్రాలతో పార్టీ కార్యాలయం ప్రారంభించడం, కార్యకర్తలతో కలిసి చిందులు వేయడం, చూస్తే మరోసారి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గెలుపు ఖాయం అనే సంకేతాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వక భేటీ

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఆయనను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ నాయకత్వంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా అమలయ్యాయని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు.

విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు మిత్రులకు నివాళులులి: ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా అమరవీరుల సంస్కరణ దినోత్సవ వేడుకలు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపిఎస్

ప్రజావాయిస్ నాగర్ కర్నూల్ అక్టోబర్ 21

నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం సంస్కరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేసి అమరవీరుల స్థూపం వద్ద వారికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పోలీస్ మైదానం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీని మనం 'పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం' గా జరుపుకుంటూ, దేశం కోసం, ప్రజల ప్రాణాల రక్షణ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సాహస పోలీసు అధికారులను, సిబ్బందిని స్మరించుకుంటున్నాం. 1959వ సంవత్సరం అక్టోబర్ 21న లడఖ్‌లోని 'హాట్ స్ప్రింగ్స్' ప్రాంతంలో చైనా దళాలు జరిపిన మెరుపు దాడిలో మన దేశానికి చెందిన 10 మంది వీర జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. దేశ సరిహద్దుల రక్షణలో ప్రాణాలర్పించిన ఆ పోలీసు యోధుల త్యాగానికి గుర్తుగా, అలాగే దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన ప్రతి పోలీసు అమరవీరుడికి నివాళిగా ప్రతీ ఏటా ఈ రోజును అమరవీరుల సంస్కరణ దినోత్సవం గా జరుపుకుంటున్నాం. శాంతిభద్రతల పరిరక్షణ, ఉగ్రవాద అణచివేత, నేరాల నిరోధం, విపత్తుల వేళ ప్రజలను ఆదుకోవడం వంటి ఎన్నో క్లిష్టమైన సందర్భాల్లో పోలీసులు ముందుంటారు. పగలు, రాత్రి, ఎండ, వాన అనకుండా తమ కుటుంబాలను, వ్యక్తిగత సుఖాలను పణంగా పెట్టి ప్రజల రక్షణే ధ్యేయంగా వారు పనిచేస్తారు. ఈ ప్రయాణంలో కొందరు తమ ప్రాణాలను కోల్పోతుంటారు. వారు చూపిన తెగువ, త్యాగం మనందరికీ ఎప్పుడూ స్ఫూర్తిదాయకం. మన జిల్లాలో1993 నవంబర్ 14 సోమశిల లో జరిగిన దుర్ఘటనలో అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశి నాయుడు ఐపిఎస్,

2. కిషోర్ కుమార్(ఎస్సై)
3. శివ ప్రసాద్ (ఎస్సై)
4. రంగారెడ్డి(హెడ్ కానిస్టేబుల్)
5. ఎన్ ప్రసాద్ (కానిస్టేబుల్)
6. సుభాన్ (కానిస్టేబుల్)
7. జహాబ్ ఇక్బాల్ (కానిస్టేబుల్)
8. జయ రాములు(కానిస్టేబుల్)
9. షైక్ హైదర్ (కానిస్టేబుల్) లు మావోయిస్టుల చేతిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వారి కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తోడుగా అండగా ఉంటుందని తెలిపారు. నేడు మనం స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నామంటే, దానికి కారణం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఆ అమరవీరుల త్యాగమే. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ప్రజలకు మరింత మెరుగైన, భద్రమైన సేవలను అందించడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి. ఈరోజు మన మధ్య లేకపోయినా, వారి స్మృతులు మనల్ని నిరంతరం కర్తవ్యపథంలో నడిపిస్తాయని నమ్ముతూ వీర జవాన్లకు, పోలీసు అమరవీరులకు జోహార్లు అనంతరం నాగర్ కర్నూల్ ఎస్పీ ఆఫీస్ ముందు ఏర్పాటు చేసినటువంటి అమరవీరుల స్తూపం దగ్గర అమరవీరుల యొక్క కుటుంబాల తోటి గ్రూప్ ఫోటో దిగడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, అమరవీరుల కుటుంబ సభ్యులు, జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు మరియు ఆర్మ్డు రిజర్వ్ సిబ్బంది తో పాటు పోలీస్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు చిన్ను నాయక్ పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లా - రోడ్డు ప్రమాదంలో భరత్ కుమార్ మృతి

ప్రజా వాయిస్ కల్వకుర్తి అక్టోబర్ 21

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో 25 ఏళ్ల భరత్ కుమార్ దుర్మరణం చెందాడు. కల్వకుర్తిలోని ఓ యాడ్స్ ఏజెన్సీలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న భరత్ కుమార్ స్వగ్రామం రఘుపతిపేట నుంచి కల్వకుర్తికి బైక్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అదుపుతప్పి బైక్ పై నుంచి కిందపడటంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆసుపత్రికి తరలించిన పోలీసులు ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

కోదాడలో ఘనంగా కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర

ప్రజా వాయిస్,కోదాడ:

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని బాలాజీనగర్ డ్రైవర్ కాలనీలో కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏఎన్ఆర్ టాక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాలు, ఉత్సాహభరితమైన నృత్యాల నడుమ అమ్మవారి శోభాయాత్ర కొనసాగింది. కాలనీలోని ప్రధాన వీధుల గుండా సాగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చైతన్య నాయక్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, రైతులకు మేలు జరిగేలా సకాలంలో వర్షాలు కురవాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఏఎన్ఆర్ టాక్స్ అసోసియేషన్ సభ్యులు అనేం నరసింహారావు, వెంకటేశ్వర్లు, జంతిక నాగరాజు, ప్రవీణ్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలతో బాలాజీనగర్ డ్రైవర్ కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన భక్తులు, స్థానికులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం..

వారి సేవలు పోలీసు శాఖకు స్ఫూర్తిదాయకం

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

సందర్భంగా అమరవీరులకు ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు పోలీస్ అమరవీరులు సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జంగయ్య, సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎల్లయ్య, జిన్నారం పోలీస్ స్టేషన్‌కు చెందిన సత్యనారాయణ, కంగ్టి పోలీస్ స్టేషన్‌కు చెందిన సురేష్ చేసిన సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ., 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన పది మంది భారత పోలీసు సిబ్బంది

త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవించగలుగుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో ఎంతో మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు పోలీస్ అమరవీరులు ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జంగయ్య, సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎల్లయ్య, జిన్నారం పోలీస్ స్టేషన్‌కు చెందిన సత్యనారాయణ, కంగ్టి పోలీస్ స్టేషన్‌కు చెందిన సురేష్ చేసిన సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని కల్పించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఎస్పీ తెలిపారు. అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నుంచి అక్టోబర్ 31న నిర్వహించే సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం వరకు ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తూ, ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యం. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల రక్షణకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ పిలుపునిచ్చారు.

మానవత్వానికి నిదర్శనం..

జోగు యాకయ్య కుటుంబానికి రూ.9,200 ఆర్థిక సహాయం

అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్తులు, స్నేహితులు, దాతలు.

చిన్న సహాయం.. ఆ కుటుంబానికి కొండంత అండ.

మానవత్వమే మహోన్నతమైన సేవ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సహృదయత.

ప్రజా వాయిస్ /పాలకుర్తి /అక్టోబర్ 21

జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామానికి చెందిన జోగు యాకయ్య (తండ్రి: సాయిలు) అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో గ్రామస్తులు, స్నేహితులు, దాతలు మానవత్వాన్ని చాటుకున్నారు. అందరూ కలిసి రూ. 9,200 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

బాధిత కుటుంబానికి అండగా గ్రామస్తులు.

యాకయ్య కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరట కల్పించాలనే లక్ష్యంతో పలువురు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించారు. కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఈ సహాయ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో పెంతల అశోక్, జోగు అంజి, జోగు ఆంజనేయులు, మారపల్లి యాకన్న, జీడి అంజి, జోగు ఎల్లయ్య, గదరి అశోక్, చింత ఎల్లయ్యతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో అందించే చిన్న సహాయం కూడా బాధిత కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని, భరోసాను ఇస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

బౌద్ధ ధర్మంతోనే ప్రపంచ శాంతి

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతోనే సమసమాజ స్థాపన

అశోక విజయదశమి ఉత్సవాల్లో మధుపాక ఎల్లయ్య..

దసరా పండుగ చరిత్రపై సాయిని నరేందర్ వ్యాఖ్యలు

హనుమకొండ, ప్రజా వాయిస్:

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవీయ విలువలను బోధించే బౌద్ధ ధర్మాన్ని ఆచరించడం ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య అన్నారు. అశోక విజయదశమిని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న బౌద్ధ ఆరామంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమితమైన కోరికలే మనిషి దుఃఖానికి కారణమని, కోరికలను నియంత్రించుకోవడంతోపాటు కరుణ, మానవత్వం, సమానత్వంతో తోటి మనుషులను గౌరవించినప్పుడే సమాజం ప్రశాంతంగా ఉంటుందని గౌతమ బుద్ధుడు బోధించారని ఎల్లయ్య పేర్కొన్నారు. బౌద్ధ ధర్మాన్ని అనుసరించే అనేక దేశాలు శాంతియుత జీవనానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. మానవీయ విలువలకు ప్రతిరూపమైన బౌద్ధ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించినప్పుడే అసమానతలు తొలగి సమసమాజం ఏర్పడుతుందని అన్నారు.

సత్యాన్ని మరుగునపరిచి దసరా పండుగను ప్రచారం చేశారు

ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్

అశోక విజయదశమి చరిత్రను ప్రజలకు వివరించిన ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్.. కళింగ యుద్ధం అనంతరం అశోకుడు హింసను విడిచిపెట్టి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడాన్ని నిజమైన విజయంగా అభివర్ణించారు. యుద్ధంలో జరిగిన ప్రాణనష్టాన్ని చూసి చలించిపోయిన అశోకుడు అహింస, కరుణ, శాంతి మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. శాంతి, ప్రేమ, సమానత్వం, సౌభ్రాతృత్వంతోనే మానవాళికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అశోక విజయదశమి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దసరా పండుగకు సంబంధించిన సంప్రదాయాలు, పురాణ గాథలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, అసలైన చరిత్రను తెలుసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయుధ పూజతో హింసను ప్రోత్సహించాలా? శాంతి మార్గంలో నడుస్తూ మనుషులను ప్రేమించాలా? అనేది ప్రజలు ఆలోచించాలని అన్నారు. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లక్షలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. బౌద్ధ ధర్మంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలు భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. అశోకుడి బోధనలు, బౌద్ధ ధర్మం, అంబేద్కర్ ఆశయాలను కాపాడుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమై సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని అన్నారు.

పలువురు సంఘాల నాయకుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జన్ను పద్మ, మాదిగ జాంబవ జాగృతి సంఘం నాయకులు బొల్లె సాంబయ్య, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుట్ల రవీందర్, ఉపాధ్యక్షులు ఎర్ర శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, డీఎస్పీ నాయకులు మేకల సుమన్, సురేష్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బూజుగుండ్ల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మంత్రి చాణిక్య, బీరం రాము, దేవరాజుగట్టు శ్రీనివాస్, భరత్, మాయవతి, ప్రసాద్, ప్రకాష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి.. బట్ట సంచులనే వాడాలి!

పర్యావరణ పరిరక్షణకు రోటరీ క్లబ్ బట్ట సంచుల పంపిణీ

ప్రజా వాయిస్, మిర్యాలగూడ టౌన్:
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని రోటరీ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచుల వినియోగానికి స్వస్తి పలికి, వాటి స్థానంలో పునర్వినియోగానికి అనువైన బట్ట సంచులను ఉపయోగించాలనే అవగాహన కల్పించేందుకు బుధవారం మిర్యాలగూడలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బట్ట సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జెడ్‌సీ క్యామ వెంకటేశం మాట్లాడుతూ.. ప్రజలు సామాజిక బాధ్యతను గుర్తించి పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ఆరోగ్యానికి మేలు చేసే అలవాట్లను అలవరచుకోవాలని కోరారు. ప్రజల్లో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు అనుముల సైదిరెడ్డి, కార్యదర్శి ఎన్. నరసింహారెడ్డి, డీసీబీ కిరణ్‌కుమార్, నేతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పాపన్నపేట (మెదక్ జిల్లా):
దేశం కోసం, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పాపన్నపేట పోలీసులు నివాళులర్పించారు. పాపన్నపేట పోలీస్ స్టేషన్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

చీకటి రోజును గుర్తు చేసుకుంటూ...
ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ, నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న కాలంలో పాపన్నపేట పోలీస్ స్టేషన్‌పై జరిగిన దాడి ఉమ్మడి జిల్లా చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఘటనగా నిలిచిపోయింది. గతంలో నక్సలైట్లు జరిపిన మెరుపు దాడిలో పాపన్నపేట పోలీస్ స్టేషన్ భవనం పాక్షికంగా కూలిపోవడమే కాకుండా, ఎంతో మంది వీర జవాన్లు, పోలీసు సోదరులు ప్రాణాలు కోల్పోయారు. ఆనాడు శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి వీరమరణం పొందిన ఆ పోలీసు సోదరుల త్యాగాలను ఈ సందర్భంగా వక్తలు, అధికారులు స్మరించుకున్నారు. వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రార్థనలు చేశారు.

ప్రజల రక్షణే ధ్యేయం
ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ప్రజలకు రక్షణగా నిలవడమే పోలీసుల కర్తవ్యమని, ప్రాణాలను అర్పించిన అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, అధికారులు మరియు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన 30 మంది కాంగ్రెస్ నాయకులు

వావిలాల గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు గులాబీ గూటికి చేరిక

గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి.

ప్రజా వాయిస్ / పాలకుర్తి / అక్టోబర్ 21
జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం.
వావిలాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అనపర్తి యాదగిరి, సూడిద రాజు, సూడిద ప్రదీప్, సంతోష్, సందీప్, అనపర్తి ప్రశాంత్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వావిలాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరడంతో వావిలాల గ్రామంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి పాదం

పోలంపల్లిలో లక్ష్మీ నరసింహ స్వామి పాదం పోలంపల్లి అదృష్టం

(ప్రజా వాయిస్) చేగుంట:
మెదక్ జిల్లా, చేగుంట మండలం, పోలంపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదం చేగుంట ప్రాంతం అంతా పూర్వం అడవులు, కొండల మధ్య ఉండేది. కాబట్టి అలాంటి చోట నరసింహ స్వామి సంచారం ఉండేదని స్థల పురాణం, పోలంపల్లిలో వెలసిన నరసింహస్వామి పాదం ప్రత్యేకతస్వయంభూ పాదం ఎవరూ చెక్కలేదు. సహజంగా రాతిపై ఏర్పడింది. అందుకే దీనికి శక్తి ఎక్కువ అంటారు చేగుంట యాదగిరిగుట్ట మార్గం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహుడికి, మెదక్ ప్రాంతానికి ఉన్న అనుబంధంలో ఈ పాదం ఒక ఆనవాలు స్వామి యాదగిరి నుంచి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇక్కడ పాదం మోపారని పెద్దల మాట. ఇప్పటికీ అలాగే ఉంది అంటే ఎన్నో ఏళ్లుగా వర్షం, ఎండకు చెక్కు చెదరకుండా ఉందంటే అది మామూలు రాయి కాదు.

పోలంపల్లికి ఇది పెద్ద వరం.
మంచి జరుగుతుంది, ఆ పాదం ఉన్న ఊరిలో పాడి పంటలు బాగుంటాయి, అంటురోగాలు, కరువు రావని నమ్మకం. చేగుంట మండలంలో పోలంపల్లి పేరు ఆ పాదం వల్లే నిలుస్తుంది. చెడు జరగదు చెడు జరగాలంటే ఆ పాదాన్ని అవమానిస్తే, దాని మీద చెత్త వేస్తే, దాన్ని తొలగించాలని చూస్తే దానిపైన ఏదైనా ఎక్కి తొక్కిస్తే అలా చేయనంత వరకు ఎలాంటి దోషం లేదు.

చిన్న ఆలయంగా మార్చండి
ఆ పాదం చుట్టూ 4 స్తంభాలతో చిన్న మండపం లాంటిది కట్టండి. దానికి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాల మండపం, పోలంపల్లి అని పేరు పెట్టలి, ప్రతి శనివారం

దీపారాధన గ్రామ యువకులు, పెద్దలు కలిసి ప్రతి శనివారం సాయంత్రం అక్కడ దీపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టండి. చాలు. ఇప్పటికైనా గ్రామస్తులు లక్ష్మీ నరసింహ ఆ పాదం పై శ్రద్ధ పెట్టి ఆ పాదాన్ని గ్రామానికి అనుకూలంగా చేయాలని గ్రామ ప్రజల కోరిక,

హేమాద్రి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తిభావం వెల్లివిరిసిన వేళ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ప్రజావాయిస్, కీసర :
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి దాయరలోని హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఈ సందర్భంగా బుధవారం ఉదయం అమ్మవారి శోభాయాత్రను ఆలయ నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిపూర్వకంగా మొక్కులు సమర్పించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా తరలివచ్చారు. భక్తి పారవశ్యంతో సాగిన శోభాయాత్రలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తమ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. అమ్మవారి దివ్యదర్శనం భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
ఉదయం నుంచే ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శోభాయాత్ర సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటూ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. శరన్నవరాత్రుల విశిష్టతను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొనగా, అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

భక్తులకు కుంకుమ, గాజుల ప్రసాదం
శోభాయాత్రకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు అమ్మవారి కుంకుమ, గాజులను ప్రసాదంగా అందజేశారు. మహిళా భక్తులు కుంకుమ, గాజులను స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని పూజించడం, కుంకుమార్చనలు నిర్వహించడం, అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించడం భక్తుల్లో విశేషమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. భక్తులంతా అమ్మవారి కృప తమ కుటుంబాలపై ఉండాలని ఆకాంక్షించారు.

చైర్మన్ కందాడి హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు
హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కందాడి హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించడం, పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా కొనసాగించడం, ఉత్సవాల్లో భక్తులు భాగస్వాములు అయ్యేలా ఏర్పాట్లు చేయడంపై ఆలయ నిర్వాహకులు దృష్టి సారించారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందుతూ ఉత్సవాలను భక్తిపూర్వకంగా జరుపుకున్నారు.

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఆలయ పరిసరాలు
శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. హేమాద్రి దేవస్థానంలో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర భక్తులలో ఐక్యతను, భక్తిభావాన్ని చాటిచెప్పింది. అమ్మవారి దివ్యనామస్మరణల మధ్య సాగిన ఈ కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. రాంపల్లి దాయరలోని హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర భక్తుల విశేష స్పందన మధ్య ఘనంగా ముగిసింది. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటుండగా, ఆలయంలో నెలకొన్న భక్తి వాతావరణం ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కందాడి హన్మంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు...

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబరం సాంగిడి గ్రామంలో మంజూరు పత్రాలు అందజేత

కాంగ్రెస్ నేతల సహకారంతో లబ్ధిదారులు రౌత్ మీరాబాయి, గోవర్కర్ ఉజ్వలకు పత్రాల పంపిణీ

యువజన కాంగ్రెస్ నేత సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంజూరు పత్రాలు అందజేసిన సర్పంచ్, ఉపసర్పంచ్

గత పదేళ్లలో రాని ఇళ్లు.. ప్రజా పాలనలో అర్హులకు అందుతున్నాయన్న కాంగ్రెస్ నాయకులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడి

ప్రజా వాయిస్, సాంగిడి/ ఆదిలాబాద్ నియోజకవర్గం
బేల మండలంలోని సాంగిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నివాస గృహ మంజూరు పత్రాలు అందజేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి సహకారంతో, యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన లబ్ధిదారులు రౌత్ మీరాబాయి, గోవర్కర్ ఉజ్వలకు గ్రామ సర్పంచ్ భూపతిరెడ్డి, ఉప సర్పంచ్ జిమ్మ శేఖర్ చేతుల మీదుగా ఇండ్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. పత్రాలు అందుకున్న లబ్ధిదారులు తీవ్ర

హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ... గత పదేళ్ల పాలనలో ఎంతోమంది అర్హులైన పేదలు ఉన్నప్పటికీ వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు దక్కలేదని ఆరోపించారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో అర్హులైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ, వాటి నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మిగిలిన అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తామని, ప్రజలంతా ఈ ప్రజాపాలన ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వినోద్, సతీష్, సాయి, సునీల్ తో పాటు కాంగ్రెస్ నాయకులు సామ నర్సారెడ్డి, దయాకర్ పటేల్, సునీల్, విలాస్, రవీందర్ పటేల్, మారుతి, మంగేష్, నందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాయిస్

కొండాపురంలో ఘనంగా ముగిసిన కబడ్డీ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేసిన ఉప్పల్ తహశీల్దార్ ఫూల్‌సింగ్ చౌహాన్

ప్రజావాయిస్ / పాలకుర్తి

జనగామ జిల్లా పాలకుర్తి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా సాగిన గ్రామీణ స్థాయి కబడ్డీ క్రీడా ఉత్సవాలు మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా ముగిశాయి. గత ఐదారు సంవత్సరాల విరామం అనంతరం యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు స్థానిక సర్పంచులు లావుడ్యా బాలోజీ (పెద్దతండా), లకావత్ సుధాకర్ (మేకలతండా), కిరణ్ (విలేజ్ సర్పంచ్) సంయుక్త ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్స్ నీట్ అకాడమీ సౌజన్యంతో పాటు దాతల సహకారంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు.దసరా, సద్దుల బతుకమ్మ పండుగల వేళ నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి కొండాపురం పరిధిలోని సీత తండా, కొండాపురం, పూసల తండా, లాల్మ తండా, పెద్ద తండా, మేకల తండాలతో పాటు పరిసర ప్రాంతాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. క్రీడాకారుల విన్యాసాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, క్రీడాభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

విజేతలకు బహుమతుల ప్రదానం:

ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ తహశీల్దార్ & ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తెలంగాణ తహశీల్దార్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ ఫూల్‌సింగ్ చౌహాన్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రథమ బహుమతి: 10,000 నగదు మరియు ట్రోఫీ
ద్వితీయ బహుమతి: 7,000 నగదు మరియు ట్రోఫీ
తృతీయ బహుమతి: 5,000 నగదు మరియు ట్రోఫీ
నాల్గవ బహుమతి: 3,000 నగదు మరియు ట్రోఫీ

ఈ సందర్భంగా తహశీల్దార్ ఫూల్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. సర్పంచులు ప్రత్యేక చొరవతో గ్రామీణ యువత ప్రోత్సాహార్థం రాజకీయేతరంగా క్రీడలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. క్రీడలు యువతలో

శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ముఖ్య సమన్వయకర్తగా డాక్టర్స్ నీట్ అకాడమీ ప్రతినిధి డా. రమేష్ చౌహాన్ వ్యవహరించగా.. నిర్వహణ కమిటీ సభ్యులు లావుడ్యా సుధాకర్, లావుడ్యా అనిల్, లావుడ్యా విజయ్, గుగులోత్ నరహరి, లావుడ్యా నరేందర్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ అమరవీరులకు పాలకుర్తి సీఐ భరత్ సుమన్ ఘన నివాళి

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు జోహార్లు పాలకుర్తి సీఐ భరత్ సుమన్

ప్రజా వాయిస్ /పాలకుర్తి /అక్టోబర్ 21

జనగామ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలోని పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ పాలకుర్తి సీఐ భరత్ సుమన్ ఘనంగా నివాళు లర్పించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం.

ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం పోలీస్ శాఖకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా నివాళులర్పించారు

అభాగ్యులకు అబన్న అస్త్రం అందిస్తున్న బిర్రం

విజయదశమి సందర్భంగా గుడేళ్లలో చీరలు పంపిణీ!

పదవిలో లేకుండా నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్న వెంకటేశ్వర్లు!

పేట మండలంలోని పలు గ్రామాలలో అనేక సేవా కార్యక్రమాలు

గిరిజన గ్రామాలలో సుపరిచితురుల కలిసిపోతున్న నాయకుడు

ప్రజా వాయిస్ అశ్వారావుపేట

ప్రస్తుత పరిస్థితులలో స్వార్థంగా ఆలోచించి ఆస్తిని కూడా పెట్టుకునే నాయకులను చూసాము అలాగే లాభాలు లేకుండా ప్రజల అవసరాలు తీర్చే నాయకులను చూసాం కానీ ఇటువంటి వాటికి భిన్నంగా మండలంలోని ఓ వ్యక్తి వ్యవసాయాన్ని నమ్ముకొని అందులో నుంచి వచ్చిన కొంత లాభాన్ని ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ తమ అవసరాలను తీర్చటమే కాకుండా గ్రామాలలో ఏదైనా అగ్ని ప్రమాదం కానీ కుటుంబం కలహాలలో నష్టాలు సంభవించినప్పుడు నేనున్నానంటూ అభాగ్యులకు ఆసరాగా నిలిచి ప్రశంసములను పొందుతున్న ఘటనలు మండలంలో అవురా అనిపించుకుంటున్నాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు ఓ భిన్నమైన ఆలోచనతో నలుగురు పేద కుటుంబాలకు సహాయం అందిస్తూ

ప్రశంసలు అందుకుంటున్నారు. పండగలు మరియు బంధువులు పుట్టిన తేదీలను ఘనంగా జరుపుకునేందుకు ఇష్టం లేక పేద కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తూ నేనున్నానంటూ ముందుకు వస్తూ అభయహస్తం అందిస్తున్న దాతగా నిలుస్తున్నారు విజయదశమి సందర్భంగా మండల పరిధిలోని బండారు గుంపు గ్రామంలో సుమారు 60 కుటుంబాల మేరకు వృద్ధులు మరియు యువకులకు దుస్తులు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి ఔరా అనిపించుకున్నారు రాజకీయంలోని అనుభవం ఉన్న తణుకు ఎలాంటి పదవులు లేకపోయినా తన వంతు సహాయం చేయాలని వ్యవసాయంలోని వచ్చిన లాభాల్లోనే కొంత భాగాన్ని నిరుపేదల అయిన గిరిజన మహిళలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ తన వంతు సహాయాన్ని అందిస్తున్నారు.

అగ్ని బాధితులకు బెర్రం ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు

మండలంలోని 29 పంచాయితీలలో ఎక్కడ ఏ గ్రామంలోనైనా గుడిసెలు అగ్నికి ఆహుతి అయితే ఆదుకునే దాత బిర్రం వెంకటేశ్వర రావే అని ప్రతి ఒక్క గిరిజనులు

సైతం అంటున్న మాటలు ప్రభుత్వ అధికారులు సైతం చేరుకుంటారో లేదో కానీ తమ వంతు సహాయనిధిగా వంట సామాగ్రి తో పాటు కొంత నగదును మరియు నిత్యవసర సరుకులను సైతం అందించి ఆదుకోవడం తనకు ఆనందం కలుగుతుందని అలాగే గ్రామాలలో పర్యటన సందర్భంలో ఆత్మబంధువు వచ్చాడని చెప్పుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని ఇటువంటి ఆనందాన్ని ధనంతో కొనలేని పరిస్థితిలో ఉంటుందని కుటుంబ సభ్యులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని వ్యవసాయని నమ్ముకొని సేద్యం చేస్తున్న దానిలోని కొంత భాగాన్ని తోటి వారికి సహాయం చేసే గుణం కలిగిన వారు చాలా అరుదుగా ఉంటారని గిరిజన గ్రామాలలో ప్రజల సైతం కొనియాడతం వినాయక పురం గ్రామస్తుల సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూల ఘనత.. పాటల పారవశ్యం సోనాలలో మిన్నంటిన 'సద్దుల' సందడి

జనజాతరను తలపించిన బతుకమ్మ నిమజ్జనం.. సోనాల వీధుల్లో తొణికిసలాడిన సాంస్కృతిక శోభ

చప్పట్లు, కోలాటాల సవ్వడుల నడుమ గౌరమ్మను ఆరాధిస్తూ ఆడిపాడిన గ్రామీణ ఆడపడుచులు

ఎంగిలిపూల నుండి సద్దుల వరకు: తొమ్మిది రాత్రుల పూల పండుగకు భక్తిపూర్వక నిమజ్జన వీడ్కోలు

రంగురంగుల పూల జలపాతంలా మెరిసిపోయిన జలాశయాలు.. సంబరాల్లో మునిగితేలిన జనం

ప్రజా వాయిస్, సోనాల /బోథ్ నియోజకవర్గం

తెలంగాణ సంస్కృతికి తలమానికమైన బతుకమ్మ ఉత్సవాలు సోనాల మండల కేంద్రంలో అంబరాన్నంటే ఉత్సాహంతో ముగిశాయి. ప్రకృతి అందాలను, ఆడపడుచుల ఆత్మీయతను ఏకం చేస్తూ తొమ్మిది రోజుల పాటు సాగిన ఈ పూల జాతర చివరి రోజైన సద్దుల బతుకమ్మతో పరాకాష్టకు చేరింది. సోనాల గ్రామంలోని ప్రతి కాలనీ నుండి మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ వస్త్రధారణతో తరలివచ్చి, తాము స్వయంగా పేర్చిన రంగురంగుల బతుకమ్మల చుట్టూ చేరి పూల పండుగను కన్నుల పండువగా జరుపుకున్నారు.ఒకరినొకరు పలకరించుకుంటూ, చప్పట్లు కొడుతూ, కోలాటాల సవ్వడుల నడుమ బతుకమ్మ పాటలు పాడుతుంటే సోనాల వీధులన్నీ మంగళవాయిద్యాలు, పాటల పారవశ్యంతో మార్మోగిపోయాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై అటుకుల, ముద్దపప్పు, నానే బియ్యం, అట్ల, అలిగిన, వేపకాయల, వెన్నముద్దల బతుకమ్మల గుండా సాగిన ఈ తొమ్మిది రోజుల వేడుకలు సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిశాయి. అనంతరం మహిళలంతా కోలాహలంగా శోభాయాత్రగా తరలివెళ్లి, చెరువు ఒడ్డున గౌరమ్మకు వాయనాలు సమర్పించి పుణ్య జలాల్లో నిమజ్జనం చేశారు. ఊరంతా ఒకే కుటుంబంలా కలిసి జరుపుకున్న ఈ సంబరం సోనాలాలో పండగ వాతావరణాన్ని నింపింది.

ఒకే వేదికపై ప్రతిభకు నీరాజనం వైద్య, శాస్త్ర పరిశోధన విద్యల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులకు ఘన సన్మానం

ఎంబిబిఎస్ సీట్ సాధించిన దేవిదాస్ కుమారుడిని శాలువాతో సత్కరించిన సర్పంచ్ బానోత్ కావేరి

తిరుపతి ఐఐఎస్ఈఆర్ లో సీటు కైవసం చేసుకున్న పంచాయతీ రాజ్ ఈఈ ధర్మేందర్ ఆడే కుమార్తె హర్షిత

ఒకే రోజు ఒకే వేదికపై ఇద్దరు ప్రతిభావంతులను ఘనంగా గౌరవించిన స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన నేతలు

నార్నూర్ కీర్తిని చాటిన గిరిజన బిడ్డలు.. విద్యార్థుల విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్న వక్తలు

ప్రజా వాయిస్, నార్నూర్ / అదిలాబాద్ నియోజకవర్గం

నార్నూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు అత్యున్నత విద్యారంగాల్లో సీట్లు సాధించి ప్రతిభ చాటడంతో, వారిని ఒకే వేదికపై అభినందిస్తూ ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నార్నూర్‌కు చెందిన చవాన్ దేవిదాస్ కుమారుడు ఎంబిబిఎస్ సీటు సాధించగా, పంచాయతీ రాజ్ ఈఈ ధర్మేందర్ ఆడే కుమార్తె హర్షిత ఆడే

తిరుపతిలోని ప్రతిష్టాత్మక జాతీయ విద్యా సంస్థ 'ఐఐఎస్ఈఆర్'లో సీటు సాధించారు.

?ఈ సందర్భంగా సోమవారం స్థానిక సర్పంచ్ బానోత్ కావేరి గజానంద్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ ఇద్దరినీ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన బిడ్డలు వైద్య విద్యలో, శాస్త్ర పరిశోధన రంగంలో

అడుగుపెట్టడం నార్నూర్ గిరిజన ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ ధర్మేందర్ ఆడే, జేఏసీ చైర్మన్ రాథోడ్ ఉత్తమ్, విటిడిఏ చైర్మన్ దిగంబర్ ఆడే, పెసా చైర్మన్ సికిందర్ రాథోడ్, చౌహాన్ ప్రకాష్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5.77 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కరంజి గ్రామస్తుల పాలాభిషేకం

దశాబ్దాల విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం నుండి పరిపాలనా అనుమతులు మంజూరు

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక చొరవను అభినందిస్తూ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన స్థానిక ప్రజలు

కరంజి, గుబిడి, టెక్డి రాంపూర్, కరణ్వాడి, గోమాత్రి గ్రామాల్లో లో-వోల్టేజ్ సమస్యలకు పూర్తిగా చెక్

నాణ్యమైన విద్యుత్ అందడంతో మోటార్లు కాలిపోయే నష్టాల నుంచి విముక్తి పొందనున్న అన్నదాతలు

ప్రజా వాయిస్, భీంపూర్ /ఆదిలాబాద్ నియోజకవర్గం

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కరంజి (టి) గ్రామస్తుల దశాబ్దాల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక చొరవ మరియు కృషితో కరంజి గ్రామానికి కొత్తగా రూ. 5 కోట్ల 77 లక్షల వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిలబెట్టుకోవడంపై కరంజి, గుబిడి, టెక్డి రాంపూర్, కరణ్వాడి, గోమాత్రి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా కరంజి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులంతా ఒకచోట చేరి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేస్తూ తమ కృతజ్ఞతలను ఘనంగా చాటుకున్నారు. ఈ సబ్‌స్టేషన్ మంజూరుతో గత కొంతకాలంగా ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న తీవ్రమైన లో-వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్య పూర్తిగా తొలగిపోనుంది. వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందడం వల్ల మోటార్లు కాలిపోవడం వంటి నష్టాల నుండి రైతులకు పెద్దఎత్తున ఊరట లభించనుంది. గృహ, వాణిజ్య అవసరాలకు నిరంతరం కరెంట్ అందడంతో స్థానిక వ్యాపారాలు మెరుగుపడి గ్రామస్తుల జీవన ప్రమాణాలు మరింత వృద్ధి చెందనున్నాయి. "ప్రజలకు ఇచ్చిన మాటే నా బాట" అని నిరూపిస్తూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి శ్రమిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు

విద్యుత్ కాంతులతో మెరిసిపోయిన బురుజు కోటలు..

పల్లెలను చూసి పట్నం యువత ఫిదా!

దసరా వేడుకలతో పులకించిన పల్లెలు..

గ్రామగ్రామాన ఘనంగా విజయదశమి సంబరాలు

?ప్రజావాయిస్ / సంస్థాన్ నారాయణపురం:
?యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల వ్యాప్తంగా దసరా పండుగ వేడుకలను ప్రజలు అత్యంత ఘనంగా, వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.?స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పురాతన కట్టడాలు, బూరుజు కోటలు, వీధులను రంగురంగుల విద్యుత్ కాంతులతో అద్భుతంగా అలంకరించారు. కోటల చుట్టూ ఏర్పాటు చేసిన కలర్‌ఫుల్ లైటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగ కోసం పట్నం నుంచి పల్లెకు చేరుకున్న యువకులు, మేధావులు ఈ సుందరమైన విద్యుత్ కాంతులను తిలకించి మురిసిపోయారు.?ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలతో పాటు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామస్తులు మరియు స్థానిక పాలకవర్గ సభ్యులు ఒకరికొకరు దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

వాయిలసింగవరంలో డీఎస్పీ,ఎస్ఐలకు ఘన సన్మానం

ఒకే కుటుంబంలో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు

సత్కరించిన సర్పంచ్

ప్రజా వాయిస్,అనంతగిరి :
అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో సిరిసిల్ల డీఎస్పీగా ఎంపికైన సట్టు భవానీ, ఉప్పల్ ఎస్ఐగా ఎంపికైన సట్టు వినయ్ లను గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు.గ్రామానికి చెందిన సట్టు భవానీ, వినయ్ లు చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలో పట్టుదలతో చదువుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించడం అభినందనీయమని సర్పంచ్ కొనియాడారు.నిరుపేద కుటుంబానికి చెందిన సట్టు అచ్చయ్య, సీతమ్మ దంపతులు ఎంతో కష్టపడి పిల్లలను చదివించి ప్రయోజకులను చేశారని ప్రశంసించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు వారికి షీల్డులను బహూకరించారు. గ్రామానికి చెందిన విద్యావేత్త, కోదాడ డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ గద్దె రాంబాబు ప్రముఖులకు సంబంధించిన పుస్తకాలను బహూకరించి అభినందనలు తెలిపారు.ఒకే కుటుంబానికి చెందిన అక్కా తమ్ముళ్లు ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు వీరిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గద్దె రఘు, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, గుండ్లపల్లి వెంకన్న, దాములూరి మురళి, బుర్రా నాగమల్లేశ్వరరావు, బుర్రా వీరబాబు, నేరెళ్ల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు అమ్మరబోయిన వంశీ, బుర్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అమరుల స్ఫూర్తితో ప్రజా రక్షణకు అంకితభావంతో పనిచేయాలి

జిల్లా ఎస్పీ డా. శబరీష్,

ప్రజా వాయిస్ మహబూబాబాద్
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులకు ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఎస్పీ డా. శబరీష్,విధి నిర్వహణలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్, ఐఏఎస్‌తో కలిసి అమర పోలీసులకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

హాట్ స్ప్రింగ్స్ ఘటన అమరుల త్యాగానికి ప్రతీక
1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద దేశ రక్షణ విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దేశ అంతర్గత భద్రత,

శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసుల పాత్ర కీలకమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖ
తెలంగాణలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో అనేక మంది పోలీసులు ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారని ఎస్పీ గుర్తుచేశారు. విధి నిర్వహణలో చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులకు నివాళి
2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎస్పీ అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని తెలిపారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలే లక్ష్యం
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అనగా ఈరోజు 21 నుంచి అక్టోబర్ 31న నిర్వహించే సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం వరకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేసే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్-ప్రజల మధ్య పరస్పర నమ్మకాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యం. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల రక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి అని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

పగిలిన పైప్‌లైన్.. పట్టించుకోని అధికారులు!

కంకణాలగూడెం, కస్తూర్బా పాఠశాల మార్గంలో వృథాగా పోతున్న నీరు

నీటి లీకేజీ వరదతో బురదమయంగా మారిన రోడ్లు

రాబోయే నీటి ఎద్దడిపై ఆందోళన చెందుతున్న గ్రామస్తులు

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. మండల కేంద్రంలోని కంకణాలగూడెం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ పగిలి పది రోజులు గడుస్తున్నా, ఇప్పటివరకు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం

చేస్తున్నారు.పైప్‌లైన్ పగిలిపోవడంతో రోజూ వేల లీటర్ల సురక్షిత తాగునీరు రోడ్డుపాలై వృథాగా పోతోంది. రాబోయే కాలంలో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా మారే ప్రమాదం ఉన్నప్పటికీ, బాధ్యత గల అధికారులు మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, కనీసం సమస్యను పరిష్కరించాలనేది లేకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.తాగునీటి సరఫరాకు సంబంధించిన లైన్‌మెన్‌లను బాధ్యత గురించి ప్రశ్నిస్తే, కనీసం స్పందించి సమాధానం చెప్పే పరిస్థితిలో కూడా లేరని గ్రామస్తులు వాపోతున్నారు.ఇప్పటికైనా జిల్లా మరియు మండల స్థాయి ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే పగిలిన పైప్‌లైన్‌ను మరమ్మత్తు చేయించి, తాగునీరు వృథా కాకుండా చూడాలని... ప్రజల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గొండ్రియాలలో మోటార్ వైర్ల దొంగల బీభత్సం

అర్ధరాత్రి పొలాల్లో చోరీలు.. రైతులకు కంటిమీద కునుకు కరువు

కాపర్ వైర్లు, స్టార్టర్లు, కేబుళ్లే లక్ష్యంగా చోరీలు

ఒక్కో రైతుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టం

సాగునీటికి ఆటంకం.. అన్నదాతల్లో ఆందోళన

పోలీసు గస్తీ పెంచాలని రైతుల విజ్ఞప్తి

ప్రజా వాయిస్, అనంతగిరి:
సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామంలో మోటార్ వైర్ల దొంగలు రెచ్చిపోతున్నారు. గత కొన్ని నెలలుగా వ్యవసాయ పొలాల్లో అర్ధరాత్రి వేళ చోరీలకు పాల్పడుతూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పొలాల్లోని మోటార్లకు అనుసంధానించిన కాపర్ వైర్లు, స్టార్టర్లు, కేబుల్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.వేలల్లో నష్టం.. సాగుకు ఇబ్బందులు.!
పంటలకు సాగునీరు అందించేందుకు రైతులు కష్టపడి ఏర్పాటు చేసుకున్న మోటార్ వైర్లు చోరీకి గురవుతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికే పలువురు రైతుల పొలాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, ఒక్కో రైతుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. మళ్లీ కొత్త వైర్లు కొనుగోలు చేయడం భారంగా మారిందని, సకాలంలో పంటలకు నీరందక దిగుబడులపై ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొలాలకు కాపలా కాయాల్సిందేనా.?
వరుస చోరీలతో రైతులు రాత్రివేళ పొలాల వద్ద కాపలా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఈ దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు

చేపట్టాలని, రాత్రిపూట గస్తీని ముమ్మరం చేసి మోటార్ వైర్ల చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం- అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు

దేశ రాజధాని దిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

దిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయులు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ దిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

జీఆర్‌ఏపీ స్టేజ్-1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం దిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం దిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్‌ఏపీ స్టేజ్-1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం

దిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయులు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్‌ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.